


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శనివారం 08-01-2022 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 95 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## ఉద్యోగులకు పీఆర్‌సీ
# ప్రకటించిన ఏపీ సర్కార్

### ఉద్యోగులకు 23.29 శాతం పీఆర్‌సీ ఇస్తున్నట్టు సీఎం జగన్
### పెంచిన జీతాలు 2022 జనవరి 1 నుంచి అమల్లోకి
### ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం



అమరావతి : ఉద్యోగుల నిరీక్షణకు తెరదించుతూ ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకటించింది. గత కొన్ని నెలలుగా జరుగుతున్న సుదీర్ఘ చర్చల అనంతరం ఎట్టకేలకు ప్రభుత్వం పీఆర్‌సీపై నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు 23.29 శాతం పీఆర్‌సీ ఇస్తున్నట్టు సీఎం జగన్ ప్రకటించారు. ఉద్యోగ సంఘాలతో సమావేశమైన సీఎం ఈమేరకు ప్రభుత్వ నిర్ణయాలను వెల్లడించారు. పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉద్యోగులకు ఊహించని వరమిచ్చారు. పెంచిన జీతాలు 2022 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. పెండింగ్ డీఏలు జనవరి నుంచి చెల్లిస్తామని, 2020 ఏప్రిల్ నుంచి కొత్త పీఆర్సీ అమల్లోకి వస్తుందని సీఎం చెప్పడంతో ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. "కొవిడ్, ప్రతికూల పరిస్థితుల కారణంగా రాష్ట్ర ఆదాయం తగ్గింది. అన్నీ పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి. మంచి చేయాలనే తపనతోనే ప్రతి అడుగూ వేస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధి సజావుగా సాగాలంటే

తరువాయి 2లో..

# ఓటుకు నోటు సూత్రధారి చంద్రబాబు

- ప్రజలు నోటుకు అమ్ముడుపోయారనడం విడ్డూరం
- 40 ఏళ్ల అనుభవం గురించి మాట్లాడటం తప్ప ఏమీ చేతకాదు
- ఏపీకి వరించిన స్కోచ్ గ్రూప్ 78వ ఎడిషన్ అవార్డులు
- ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని రకాలుగా మేలు చేస్తున్న సీఎం జగన్
- రైతు భరోసా కేంద్రల్లో ఏటీఎంలు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- చంద్రబాబు తీరుపై ట్విట్టర్ వేదికగా మండిపడ్డ ఎంపీ విజయసాయిరెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్): నోట్లకు అమ్ముడుపోయారంటూ కుప్పంలో ప్రజలపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు విమర్శలు చెయ్యడం విడ్డూరంగా ఉందని రాజ్యసభ సభ్యులు, వైఎస్‌ఆర్ సిపి పార్లమెంటరీ నాయకుడు విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలు అంశాలపై విజయసాయిరెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఓటుకు నోటు సూత్రధారి అయిన చంద్రబాబు ఓట్లు కొనదలచుకుంటే ఎంతైనా ఇవ్వగల డట! కానీ విలువలకు కట్టుబడి ఓట్లు కొనడట ఈయన విలువలగురించి ప్రవ చనాలు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించి నట్లుందన్నారు. నలబై ఏళ్ల అనుభవం గురించి మాట్లాడే చంద్రబాబు. రాజకీయ పార్టీల మధ్య పొత్తులను లవ్ అఫైర్ల స్థాయికి దిగజార్చాడని అన్నారు. వన్ సైడ్ లవ్, టూ సైడ్ లవ్ అంటూ తెలివి తక్కువ మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని,టిడిపి అనుకుల మీడియా,ఆయన బినామీలే నమ్మతారని అన్నారు.

తెలుగుదేశం బాటలో నడుస్తూ ప్రభుత్వంపై విషం చిమ్మడం,తరువాత తమ ఎజెండాకు అడ్డువచ్చే నేతలపై బురద జల్లడం కొన్ని ఛానళ్లకు రివాజైందని టిడిపి అనుకూల మీడియాపై మండిపడ్డారు. స్కోచ్ గ్రూప్ 78వ ఎడిషన్‌లో భాగంగా ప్రకటించిన అవార్డుల్లో

తరువాయి 2లో..

## మార్చిలో పదో తరగతి పరీక్షలు
### - మంత్రి ఆదిమూలపు సురేష్



గుంటూరు: ఏపీలో పదో తరగతి పరీక్షలు మార్చిలో నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. సంక్రాంతి నాటికి సిలబస్ పూర్తి చేయాలని విద్యాసంస్థలకు సూచించారు. 15 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులకు ప్రతి స్కూల్లో 95% వ్యాషినేషన్ పూర్తి చేశామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో అమ్మఒడి మూడో విడత ఇస్తామని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని బీఈడీ, డీఈడీ కాలేజీలు 375 మూతపడ్డాయని మంత్రి సురేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలో చట్టసవరణ ద్వారా 35% ఫ్రీ సీట్లు ఇప్పించామని పేర్కొన్నారు. సంక్షేమం రెండు కళ్ళుగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏ విద్యార్థి డబ్బులు లేక విద్యకు దూరం కాకూడదని అమ్మఒడి ఇచ్చి విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ పాటు మధ్యాహ్నం పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ఇంగ్లీష్ మీడియం చెప్తూ తెలుగు కూడా బోధిస్తున్నామన్నారు.

## కోవిడ్ నిబంధనలు పాటించాలి

- జిల్లాలో కోవిడ్ కేసులు పెరుగుతున్నందున రామకృష్ణా బీచ్ లో పర్యాటకులు
- సందర్శకులు కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించిన జిల్లా కలెక్టరు డా.ఎ.మల్లిఖార్జున
- పైనాపిల్ కాలనీ, ఆరిలోవ లో హుద్ హుద్ ఇళ్లను పరిశీలించి, కోవిడ్ కేర్ సెంటర్లుగా సిద్ధం చేయాలని సూచనలు జారీ
- విమ్స్, కె.జి.హెచ్. లను పరిశీలించి డాక్టర్ల కు పలు సూచనలు జారీ



విశాఖపట్నం (విజయభాను న్యూస్): జిల్లాలో కోవిడ్ కేసులు పెరుగుతున్నదృష్ట్యా జిల్లా ప్రజలందరూ కోవిడ్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని జిల్లా కలెక్టరు డా.ఎ.మల్లిఖార్జున విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం కలెక్టరు, జాయింట్ కలెక్టరు పి.అరుణ్ బాబు, జి.వి.ఎం.సి కమిషనరు లక్ష్మిశ లతో కలసి జిల్లాలో పలు ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా రామకృష్ణా బీచ్ లో పరిశీలించి పలు చోట్ల అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలని జి.వి.ఎంసి అధికారులకు సూచించారు. అక్కడ పోలీసు, జి.వి.ఎం .సి సిబ్బంది విధులను నిర్వహిస్తూ పర్యాటకులకు కోవిడ్ నిబంధనలపై అవగాహన కలిగించాలన్నారు. రామకృష్ణా బీచ్ లో కూర్చుని ఉన్నపర్యాటకులను చూసి వారితో చర్చించారు. తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. ఇతర

తరువాయి 2లో..

## 8 నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు

విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు సంక్రాంతి సెలవుల తేదీలను రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. జనవరి 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సెలవులు ఇస్తున్నట్లు పేర్కొంది. మళ్లీ 17న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపింది. కాగా గత నాలుగు రోజులుగా టీనేజర్లకు కొనసాగుతున్న కోవిడ్ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నేటితో(శుక్రవారం) ముగియనుంది. ఇప్పటి వరకు 16 లక్షల మంది టీనేజర్లకు వ్యాక్సిన్ అందించారు. పాఠశాలలకు సెలవులు కావడంతో రేపటి(శనివారం) నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో పిల్లలకు వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టనున్నారు.




## స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించిన చైర్‌పర్సన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్): మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జరిగింది. స్టాండింగ్ కమిటీ అజెండాలో మొత్తం 59 అంశాలు, ఒక టేబుల్ అజెండాను పొందుపరిచారు. దానిలోని భాగంగా 6వ అంశమునకు సంబంధించి 2022-23 బడ్జెట్ నుండి పొందవలెనని తీర్మానించారు. 58వ అంశములో టీఎస్‌ఆర్ వాణిజ్య సముదాయంలో దుకాణం నెంబర్లు. 1, 2, 16, 47, 48, 52, పశ్చిమ భాగంలో దుకాణం నెం. 1, డైస్ ట్యాంకు వాణిజ్య సముదాయంలో దుకాణం నెం. 6, పాత బస్సు స్టాండ్ ఫేజ్-1 లో దుకాణం నెం. 1, సూర్య భాగ్ వాణిజ్య సముదాయంలో దుకాణం నెం. 2, పద్మ నగర్ వాణిజ్య సముదాయంలో దుకాణం నెం. 6, జగదాంబ వాణిజ్య సముదాయంలో దుకాణం నెం. 1 నుండి 5 వరకు మరల వేలం నిర్వహించవలెనని మిగిలిన దుకాణాలన్నీ ఆమోదిస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు, అదనపు కమిషనర్ ఎ.వి.రమణి, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, డి.సి.(రెవెన్యూ) పి. నల్లనయ్య, డి.ఇ.ఒ. శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎ. శ్రీనివాస్, పి. శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు బొడ్డేపల్లి రాము, శివప్రసాద్, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# మూడు రూపాయల టికెట్ నే కొనసాగించాలి



యానాం (విజయభాను న్యూస్): సావిత్రి నగర్ యువత అధ్యక్షులు మల్లాడి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ఉన్న సమస్యలపై అనగా సావిత్రి నగర్, గిరియాంపేట, దరియాలతిప్పా నుండి యానాం విద్య కొరకు వచ్చే విద్యార్థుల నుండి 15 రూపాయలు తీసుకుంటున్నందున గతంలో ఏవిధంగా అయితే 3 రూపాయలు టికెట్ తీసుకొనేవారో ఇప్పుడు కూడా ఇదే విధంగా 3 రూపాయలు తీసుకోవాలని అంతే కాకుండా సావిత్రినగర్ నుండి గిరియాంపేట మెయిన్ రోడ్డులో లైట్స్ వెలగని కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున వెంటనే లైట్స్ కూడా వేసేలా చర్యలు తీసుకోవాలని యానాం ప్రాంతీయ పరిపాలనాదికారి అమన్ శర్మ కి, పి ఆర్ టి సి ఇంచార్జ్ మేనేజర్ కి, ఎలక్ట్రిసిటీ, మరియు మునిసిపల్ అధికారులను వినతిపత్రం ద్వారా కోరడమైనది. ఈ యొక్క కార్యక్రమంలో

సావిత్రినగర్ యువత అధ్యక్షులు మల్లాడి రాజు, సావిత్రినగర్ మాజీ ప్రెసిడెంట్ మల్లాడి బీరాస్వామి, పేస్సింగి శ్రీను, పోతాబత్తుల రామ్మోహన్, ఓలేటి కాలాస్త్రి పాల్గొన్నారు.

# కణితి హైస్కూల్ లో సీఎం కప్ సంక్రాంతి సంబరాలు



గాజువాక : (విజయభాను న్యూస్ : 87వ వార్డు లో కణితి హైస్కూల్ లో సీఎం కప్,సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గాజువాక జోనల్ కమిషనర్ శ్రీధర్ పాల్గొని సీఎం కప్ లో భాగంగా గాజువాక నియోజక వర్గ బాలుర, బాలికల కబడ్డీ పోటీలను, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సంక్రాంతి సంబరాలు కార్యక్రమాన్ని, ముగ్గుల పోటీలను, సంక్రాంతి విభిన్న వేషధారణ లను వీక్షించారు.

ఈ కార్యక్రమం లో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశ్ రావు , స్కూల్ సిబ్బంది, స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు, ప్రగఢ వేణు బాబు ముద్దపు దామోదర్ రావు దుగ్గపు దానప్పలు బొండా గోవింద్ రాజులు తది తరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ నూతన సంవత్సరం 2022 క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ




గాజువాక : యు టి ఎఫ్ నూతన సంవత్సరం 2022 క్యాలెండర్, 2022 డైరీ, స్టిక్కర్ లను పెదగంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మండల యు టి ఎఫ్ అధ్యక్షుడు రకీబీర్ రాజిక్, సహధ్యక్షులు వంగా రామలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల ప్రాధానోపాధ్యాయుయలు అప్పలరాజు ద్వారా ఆవిష్కరింప చేసి ఉపాధ్యాయులు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్యనారాయణ,సబిరా, పాలవెల్లి,సుధారాణి, చిన్నారావు,అప్పల నాయుడు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ పేరుమీద మృత్యుంజయ జపాలు



గాజువాక : (విజయభాను న్యూస్) : బుధవారం పంజాబ్ రాష్ట్రంలో దేశ ప్రధాని నరేంధ్రమోదీ గారికి భద్రత కల్పించడంలో పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అవడంపై బీజేపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపుమేరకు గాజువాకలో రాష్ట్ర మహిళామోర్చా నాయకురాలు రోహిణి ఆధ్వర్యంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్యఅతిధిగా పాల్గొని చినగంట్యాడ దరి అఫీషియల్ కోలనీ శ్రీ సంపత్ వినాయక ఆలయంలో మహా మృత్యుంజయ జపం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె ఎన్ ఆర్ మాట్లాడుతూ దేశప్రదానికే భద్రత కల్పించలేని ఆ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొండా యల్లాజీరావు,జిలకర్ర భువనేశ్వరి, బొండా శ్రీదేవి,వర్రి లలిత,పుష్పలత,కట్టా పద్మ,నాగేశ్వరరావు,వరలక్ష్మి ,రామస్వామి,రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించిన ఏపీ సర్కార్

ఉద్యోగుల పాత్ర ముఖ్యం. ఫిట్మెంట్ 14.29 శాతం కన్నా ఎక్కువ ఇచ్చే పరిస్థితి లేదని అధికారుల కమిటీ చెప్పింది. అయినా.. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకెళు తున్నాం'' అని సీఎం వెల్లడించారు. ఈ నిర్ణయాల వల్ల ఏడాదికి ప్రభుత్వంపై రూ.10,247 కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ, ఉద్యోగులకు మంచి చేయాలని ఈ బాధ్యతను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ మాట్లాడుతూ సీఎస్తో కూడిన అధికారుల కమిటీ 14.29శాతం మించి ఫిట్మెంట్ ఇవ్వలేమని చెప్పింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితులను, సమస్యలను అన్నికోణాల్లో క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఒక వాస్తవికమైన ఫిగర్ను వారు చెప్పినప్పటికీ... అటు ఉద్యోగుల ఆకాంక్షలను, ఇటు రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకుని, ఉద్యోగులకు వీలైనంత మంచి చేయాలన్న తపన, తాపత్రయంతో ఫిట్మెంట్ను 23శాతంగా నిర్ణయించాం. అధికారుల కమిటీ చెప్పిన 14.29శాతం కన్నా దాదాపు 9శాతం పెంచి ఫిట్మెంట్ ఇస్తున్నాం.

సీఎస్తో కూడిన అధికారుల కమిటీ 2022 అక్టోబరు నుంచి కొత్త పీఆర్సీ ప్రకారం సవరించిన జీతాలు ఇవ్వాలని ప్రతిపాదించినప్పటికీ, ఉద్యోగుల ఆకాంక్షల మేరకు 10 నెలల ముందే, అంటే జనవరి 1, 2022 నుంచే పీఆర్సీని అమలు చేసి, దాని ప్రకారం జీతాలు ఇవ్వాలని ఆదేశించినట్టు సీఎం తెలిపారు. 2020 ఏప్రిల్ నుంచే మానిటరీ బెన్ఫిట్. ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంపు. 1- 1-2022 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు జూన్ 30లోపు ప్రొబేషనరీ, కన్ఫర్మేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం. సవరించిన విధంగా రెగ్యులర్ జీతాలను (న్యూ పేస్కేలు) ఈ ఏడాది జులై జీతం నుంచి ఇవ్వాలని ఆదేశించాం. కొవిడ్తో మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు జూన్ 30లోపు పూర్తి చేస్తాం. ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్యను రెండు వారాల్లో పరిష్కరిస్తాం.

సొంత ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం రిబేటుతో జగనన్న స్మార్ట్ టౌన్షిప్లలో ఇళ్ల కేటాయింపు. 10 శాతం ప్లాట్లు ఉద్యోగులకు రిజర్వ్ చేస్తాం. నియోజకవర్గాన్ని ఒక యూనిట్గా తీసుకుంటాం. ఉద్యోగులు ఎవ్వరికీ కూడా ఇంటిస్థలం లేదనే మాట లేకుండా చూస్తాం. ఆ రిబేటును కూడా ప్రభుత్వం భరిస్తుంది. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, పీఎఫ్, జీఎల్ఐ, లీవ్ ఎన్క్యాష్మెంట్ తదితరాలన్నీ కూడా ఏప్రిల్నాటికి పూర్తిగా చెల్లించాలని ఆదేశించాం.

పీఆర్సీ అమలు చేసేనాటికి పెండింగ్ డీఏలు ఉండకూడదని స్పష్టంగా చెప్పినమీదట, పెండింగులో ఉన్న అన్ని డీఏలను ఒకేసారి జనవరి జీతంతో కలిపి ఇవ్వాలని ఆదేశించాం. కొత్త స్కేల్స్ను, రెగ్యులర్ ఉద్యోగులతో పాటు, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మేలు చేయాలనే ఉద్దేశంతో వారికి కూడా 2022 జనవరి జీతాలతోనే అమలు చేయాలని నిర్ణయించాం. సీపీఎస్కు సంబంధించి టైంలైన్ పెట్టుకోవాలి. ఇప్పటికే కేబినెట్ సబ్కమిటీ వేశాం. జూన్ 30లోగా ఒక నిర్ణయం తీసుకుంటాం. అని సీఎం వెల్లడించారు.

**ఉద్యోగుల సొంతింటి కల నెరవేరనుంది: బొప్పరాజు**

రెండు వారాల్లో హెల్త్ కార్డుల సమస్య పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని అమరావతి ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. సీఎంతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''ఉద్యోగుల సొంతింటికల నెరవేర్చేలా సీఎం నిర్ణయం తీసకున్నారు. స్మార్ట్ సిటీలో ఉద్యోగుల ఇంటి నిర్మాణానికి 20శాతం రాయితీ ఇస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఒకటో తేదీకే జీతాలు ఇస్తామన్నారు. సీపీఎస్ అంశంపై టైమ్ బౌండ్ ప్రకటించారు. ఫిట్ మెంట్ సమస్య మినహాయిస్తే.. మిగిలిన అన్ని సమస్యలపై సీఎం .. టైమ్ బౌండ్ ప్రకటించడం మంచి నిర్ణయమే'' అని బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు.

# కోవిడ్ నిబంధనలు పాటించాలి

ప్రాంతాల నుండి వచ్చు పర్యాటకులు కోవిడ్ నిబంధనలు పాటించక పోతే ఇక్కడ మరియు వారి ప్రాంతాలలోని ప్రజలకు కూడా కోవిడ్ సోకే ప్రమాదం ఉందన్నారు. తదుపరి కలెక్టరు ఆరిలోవ వార్డు 13 నందలి హుద్ హుద్ ఇళ్లను పరిశీలించారు. అక్కడ పరిసరాలను పరిశుభ్రంగావించాలని ప్రతి యింటిని పరిశీలించి కోవిడ్ కేర్ సెంటరుగా మార్చడానికి తగు ఏర్పాట్లు గావించాలని జి.వి.ఎం .సి అధికారులకు సూచించారు. విమ్స్ ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టరు అక్కడి వైద్యలను రోగులకు అందిస్తున్న సేవలు, ఒ.పి., డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిల్వ ఉన్న ఆక్సిజన్ సిలిండర్లు, వాటి సామర్ధ్యము వినియోగపు వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అవసరమైన స్థాయిలో ఎల్.ఎమ్.వో. ట్యాంకులు, ఆక్సిజెన్ సిలెండర్లు వున్నాయని, మూడవ వేవ్ ను ఎదుర్కోడానికి సిద్ధంగా వున్నామంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి కలెక్టరు కె.జి.హెచ్ కు వచ్చి వైరాలజీ ల్యాబ్ ను పరిశీలించారు. వైరాలజీ

ల్యాబ్ లో ఆర్.టి.సి.పి.సి.ఆర్. టెస్టుల సంఖ్య పెంచాలన్నారు. జినోమ్ సీక్వెన్సీ టెస్ట్ కు ఏర్పాట్లు గావించాలన్నారు. సి.ఎస్.ఆర్ బ్లాక్ ను పరిశీలించి అక్కడి బెడ్స్, ఇతర సౌకర్యాలు, వివరాలను అడిగి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరు ఎ.ఎం .సి ప్రిన్సిపల్ ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు. కోవిడ్ టెస్టులు, రిపోర్టులు, హోమ్ ఐసోలేషన్ లో ఉన్న వారికి వైద్య సేవలు, డేటా, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. మార్చురీ నిర్వహణ, పోస్ట్ మార్టెమ్ లు, ఫోరెన్సిక్ సిబ్బంది, తదితర అంశాలపై చర్చించారు. కేసులు అధికంగా వస్తే వాటిని తట్టుకుని ఎలా వైద్య సేవలు అందించాలో చర్చించి పలు సూచనలు చేశారు. కె.జి.హెచ్. లో మార్చురీని అభివృద్ధి చేయాలంటూ అందుకు కావలసిన నిధులు మంజూరు చేస్తామన్నారు. ఫిబ్రవరి నెల నుండి రాత్రి షిఫ్ట్ లో కూడా పోస్ట్ మార్టమ్ లు నిర్వహించాలన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు గావించాలని ఆంధ్రా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ ను, కె.జి.హెచ్. సూపరింటెండింట్ ను ఆదేశించారు. ఈ సందర్భముగా కలెక్టరు జి.వి.ఎం .సి కమిషనర్ కు మరియు వైద్యాధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు పి.అరుణ్ బాబు, జి.వి.ఎం .సి కమిషనరు లక్ష్మీశ, ఎ.పి.ఎస్.ఎం,డి.సి ఇఇ నాయుడు, జి.వి.ఎం .సి అదనపు కమిషనరు శ్రీనివాస్, ఎ.ఎం.సి ప్రిన్సిపాల్ డా.సుధాకర్, కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డా. మైథిలి, డా.దేవిమాధవి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు సూత్రధారి చంద్రబాబు

అత్యధిక అవార్డులు ఏపీని వరించాయని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ కేటగిరిల్లో 5 గోల్డ్, 5 సిల్వర్ స్కోచ్ మెడల్స్ రాష్ట్రానికి దక్కాయని పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, నేతన్న నేస్తం పథకాలకు గోల్డ్ స్కోచ్లు దక్కడం సంతోషకరమని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎంత మంచి చేయగలిగితే అంత మంచి చేస్తానని సీఎం వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారని చెప్పారు. పీఆర్సీపై ఉద్యోగ సంఘాలతో చర్చించిన సీఎం జగన్ వారికి అన్ని రకాలుగా మేలు చేసే ప్రయత్నాలు చేస్తామని, రెండు మూడు రోజుల్లో పీఆర్సీపై ప్రకటన చేస్తామని స్పష్టం చేశారని ఆయన గుర్తు చేశారు.

గ్రామస్థాయిలో రైతులకు బ్యాంకింగ్ సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతీ రైతుభరోసా కేంద్రంలో ఏటీఎంల ఏర్పాటుకు సంకల్పించిందని ఆయన చెప్పారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి చొరవతో ఏటీఎంల ఏర్పాటుకు బ్యాంకర్లు ముందు కొస్తున్నారని వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాకొక ఆర్బీకేలో వీటిని ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.

## ఆగ్రి క్లీనిక్ల ఏర్పాటుపై గీతంలో శిక్షణ

సాగర్నగర్ : వ్యవసాయ రంగంలో స్టార్టప్లను ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత వ్యాపార సంస్థలను నెలకొల్పాలనుకునే ఔత్సాహిక యువతీ యువకులను ప్రోత్సాహించడానికి భారత ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖకు అనుబంధం గల నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రి కల్చరల్ ఎక్స్టెన్సన్ మేనేజ్మెంట్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి అగ్రి ప్రెన్యూర్ షిప్ ట్రైనింగ్ పేరిట శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. గీతం సోషల్ ఇంక్యుబేషన్ మరియు ఎంటర్ ప్రెన్యూర్షిప్ కేంద్రంలో 45 రోజుల పాటు జరిగే ఈ ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లి నితిన్ సాయి తెలిపారు. డిగ్రీ తత్సమాన కోర్సులలో జీవ శాస్త్రాలు, వ్యవసాయ ఆధారిత సబ్జెక్టులు పూర్తి చేసిన వారు లేదా 60 శాతం వ్యవసాయ సంబంధ సబ్జెక్టులతో డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వారు లేదా ఇంటర్లో 55 శాతం వ్యవసాయ సంబంధ కోర్సులలో మార్కులు సాధించిన వారు ఈ ఉచిత శిక్షణకు ధరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేసి ఉచిత భోజన, వసతి సదుపాయంతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసికున్న వారికి ఆగ్రి క్లీనిక్, బిజినెస్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన రుణ సదుపాయాన్ని, ప్రోత్సాహకాలను ప్రభుత్వం నుంచి పొందేలా మార్గదర్శకం చేస్తామన్నారు. ఆసక్తి గల వారు గీతం సోషల్ ఇంక్యుబేషన్ మరియు ఎంటర్ ప్రెన్యూర్షిప్ కేంద్రం కో-ఆర్డి నేటర్ను 9030583456 నెంబర్లు సంప్రదించాల్సిందిగా సూచించారు.

# ప్రతి నిత్యం నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తోంది

## - సాంకేతికతలపై యువత అవగాహన పెంచుకోవాలి
## - ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రా రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్): ప్రతి నిత్యం నూతన ఆవిష్కరణకు సమాజం వేదికగా నిలుస్తోందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం రఘు ఇంజనీరింగ్ కళాశాల,రఘు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు 'కంప్యూటింగ్, కమ్యూనికేషన్ అండ్ పవర్ టెర్నాలజీ(ఐసి3పి2022)ను ఆయన ప్రారంభించారు. ఐఈఈఈ విశాఖ బే సెక్షన్ సాంకేతిక సౌజన్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆచార్య హేమచంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక అంశాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మారుతున్న సాంకేతికతలను నిత్యం గమనిస్తూ ఆకళింపు చేసుకునే ప్రయత్నం జరగాలన్నారు. సాంకేతిక ప్రగతి ఫలితంగా అరచేతిలో విశ్వజ్ఞానం అందుబాటులోనికి వస్తోందని, దీనిని యువతరం తమ భవిష్యత్తును మలచుకునే దిశగా వినియోగించాలని సూచించారు. ఉచితంగా అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను ఉపయుక్తంగా నిలుపుకుంటూ, ఆవిష్కరణలకు యువతరం నాందిపలకాలని సూచించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్, ఎంటర్ప్యూనర్షిప్లు నేటి తరానికి సుపరిచితాలన్నారు. ఈ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని తద్వారా దేశ అర్థిక అభివృద్ధిలో భాగం కావడం సాధ్యపడుతుందన్నారు. ఈ దిశగా రఘు విద్యాసంస్థలు చేస్తున్న కృషిని అభినందించారు. సమ్మిళిత విద్యను అందిస్తూ, విద్యార్థి సంపూర్ణ వికాసానికి దోహదపడే విధంగా రఘు విద్యా సంస్థలు విద్యను అందించడం అభిలషనీయమన్నారు. రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ ఉన్నత విద్య అవసరాలను గుర్తించి, తదనుగుణంగా అవసరమైన ప్రోత్సాహం, తోడ్పాటును అందిస్తూ ఉన్నత విద్యా మండలి పనిచేస్తోందని, ఇది విద్యా రంగానికి ఎంతో శుభపరిణామమన్నారు.బోధన వృత్తి ఎంతో ఉత్కృష్టమైనదన్నారు. విద్యార్థుల్లో ఆసక్తి, ఉత్సుకత పెంచే విధంగా బోధన జరపాలని ఆచార్యులకు సూచించారు. విద్యార్థులు నూతన సాంకేతికతలపై అవగాహన పెంచుకోవాలని, ప్రాజెక్టులను నిర్వహిస్తూ ప్రత్యక్ష జ్ఞానం పొందే ప్రయత్నం చేయాలని సూచించారు. ఐఈఈఈ వైజాగ్ బే అద్యక్షుడు ఆచార్య ఎస్.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తమ సంస్థ సౌజన్యంతో విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న తొలి సదస్సుగా ఇది నిలుస్తుందన్నారు. ఐఈఈఈ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సభ్యులు, తదితర అంశాలను వివరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా తమ సంస్థ నిర్వహించే కార్యక్రమాలు తెలియజేశారు.




కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి.సతీష్ రామ చౌదరి మాట్లాడుతూ సదస్సులో భారత్తో పాటు వివిధ దేశాల నుంచి 206 పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. సదస్సును హైబ్రిడ్ మోడల్లో నిర్వహిస్తున్నామన్నారు.

రెండు రోజుల సదస్సులో భాగంగా 2 కీలకోపన్యాసాలు, టెక్నికల్ సెషన్స్ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రఘు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ సి.హెచ్ శ్రీనివాస్, రఘు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ కళాశాల ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను ఆచార్య హేమచంద్రా రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కళాశాల తరపున ఆచార్య హేమచంద్రా రెడ్డిని చైర్మన్ రఘు కలిదిండి సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

# ఎగువ మొదాపుట్టు గ్రామంలో మంచి నీటి సమస్య తక్షణమే పరిష్కరించాలి : సీపీఐ

పాడేరు (విజయభాను న్యూస్) : శాఖ ఏజెన్సీ ప్రాంతమైన పాడేరు మండలం ఎగువ మ్నొదాపుట్టు గ్రామంలో మంచి నీటి కష్టాలను తక్షణమే తీర్చాలని సిపిఐ పార్టీ పాడేరు మండల కార్యదర్శి కూడ రాధాకృష్ణ, సిపిఐ పార్టీ నాయకులు జల్లి రాజబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ : ఆదివాసి ప్రాంతంలో ఎండలు పెరుగుతున్న క్రమంలో మంచి నీటి కొరత ఏర్పడుతుందని, సుమారు 150 గడపలు ఉన్న ఎగువ మొదాపుట్టు గ్రామంలో మంచినీటి కొరత తో అనేక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామస్తులందరూ వాగుల్లో వస్తున్న నీరే ఆధారం తప్ప మరో మార్గం లేదని, తక్షణమే ఎగువ మ్నొదాపుట్టు మంచినీటి సౌకర్యం కల్పించి తాగునీటి కష్టాలు తీర్చాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



# ఐఏఎస్ఇలో సంక్రాంతి సంబరాలు నిర్వహణ

ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఇ)లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, జానపద నృత్య పోటీలను నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పాలక మండలి సభ్యులు ఆచార్య క్రిష్ణ మంజరి పవార్, ఐఏఎస్ఇ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య కె.విశ్వేస్వర రావు, ఆచార్య నాగరాజ కుమారి తదతరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత

# కన్నుల పండువగా సంక్రాంతి సంబరాలు

- హాజరైన ఎంపీపీ పిల్లలతో కలిసి నృత్యాలు అట్టహాసంగా సంబరాలు
- వెంకి నాయుడు పేట లోని ఎంపిపిఎస్ లో పండుగ వాతావరణం



నర్సీపట్నం, (విజయభాను న్యూస్): సంక్రాంతి సంబరాలు ప్రభుత్వ పాఠశాలలో మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంకునాయుడుపేట లో గల యమ్ పి పి యస్ ప్రధానోపాధ్యాయులు యమ్ వీరమాంబ, ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వేడుకలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలబాలికలకు వేషధారణలు, గాలి పటాలు ఎగుర వేత, రంగవల్లులు,కోడి పందాలు బసవన్న నిజ స్వరూపాలు, హరిదాసు వ్యాసాలు, భోగి మంటలు, సాంప్రదాయబద్ధమైన భోజనాలు ఏర్పాటు చేసి పిల్లల్లోనూ పాఠశాలలోనే పండగ వాతావరణం గా మార్చి ప్రభుత్వ పాఠశాల అంటే మరింత మొక్కువ పెంచి ప్రభుత్వ పాఠశాల అభిరుచిని పిల్లల్లోనూ పాఠశాల వాతావరణాన్ని పండగ వాతావరణం గా మార్చి ప్రభుత్వ పాఠశాల అంటే మరింత అభి మానం పెంచారు.



పాఠశాలలోని క్రిస్మస్ తో పాటు అన్ని రకాల పండగలను జరిపిస్తామని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఓరుగంటి మణి, వైస్ చైర్మన్ దేవి పలువురు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు డి జి నాద్, సునీత, యమ్ లక్ష్మి,ఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు పరవాడలో మంత్రుల భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

## విలేఖరులో సమావేశంలో ఎంపీపీ పైలా

పరవాడ (విజయభాను న్యూస్): నేడు పరవాడలో జరగనున్నబారీ బహిరంగసభను పెందుర్తి నియోజకవర్గంలో గల నాయకులు,కార్యకర్తలు,అదికార్లు హజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలానీ పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనువాస్ కోరారు. శుక్రవారం అయన పరవాడలో నిర్వహించిన విలేఖర్లు సమావేశంలో ఎంపిపి మాట్లడుతూ నేడు మద్యహ్నం రెండు గంటలకు ప్రజా సంక్షేమ యాత్ర పరవాడ మండలం లో ముగింపు సందర్భంగా పరవాడ సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ కు విశాఖపట్నం జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కురసాల కన్నబాబు, జిల్లా మంత్రి వర్యులు మరియు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక క్రీడాశాఖామాత్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు(అవంతి) , పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్ రాజ్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు బిశెట్టి సత్యవతి, విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ జల్లి పల్లి సుభద్ర, పెందుర్తి నియోజకవర్గంలో గల ఎంపీపీ లు, జడ్పీటిసి లు, వార్డు కార్పొరేటర్ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు అందరు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో గల నాయకులు,కార్యకర్తలు విధిగా హజరై జయప్రదంచేయాలానీ ఈ సందర్భంగా ఎంపిపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనువాస్ కోరారు.వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరావు, బూస అప్పలరాజు, వైసిపి జిల్లా ప్రదాన కార్యదర్శి చుక్కరామునాయుడు,సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు తథితర్లు పాల్గోన్నారు.



# మండల టీడీపీ అధ్యక్షురాలుగా పైలా, సెక్రటరీగా బొద్దపు

పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలిగా పైల వరలక్ష్మి, ప్రధానకార్యదర్శి గా బొద్దపు నూకరత్నం ను మాజీ మంత్రి వర్యులు బండారు సత్యన్నారాయణ మూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పైలా జగన్నాథ రావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు, టిడిపి జడ్పిటిసి అభ్యర్థి అట్ట సన్యాసి అప్పారావు, టిడిపి మండలపార్టి అద్యక్షులు వియ్యపు చిన్నా (మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు) పార్లమెంటరీ ఉపాధ్యక్షులు బొండా సన్నిదేముడు మరియు మండల తెలుగు దేశం పార్టీ నాయకులు అందరూ కలిసి ఎంపిక చేశారు. వారికి బండారు సత్యన్నారాయణ మూర్తి , పైలా జగన్నాథ రావు కలిసి వారిని సాలువా మరియు పూల మాల తో సత్కరించారు. ఈ కార్యక్రమం లో జడ్పిటిసీఅభ్యర్థి అట్టసన్యాసి అప్పారావు, మండలపార్టి అద్యక్షులు వియ్యపు చిన్నా , అనకాపల్లి పార్లమెంట్ టిఎన్ టియుసి అధ్యక్షులు రొంగలి గోపాలకృష్ణ, వెన్నెల అప్పారావు (మాజీఉప సర్పంచ్) మాజీ ఎంపిటిసిపైలా రథాల సన్యాసిరావు, తెలుగు యువత అద్యక్షులు పైలా చిన ఆక్కు నాయుడు, గొంప మారు నాయుడు, పైల బుజ్జి, పైలసింహాద్రి రావు, వెన్నెల అభినాయుడు, బండారు సతీశ్, పైల సన్ని బాబు, మహిళలు, కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.



# భాజపా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్వామి వివేకానంద కబడ్డీ టోర్నమెంట్

విశాఖపట్నం (విజయభాను న్యూస్) :ఈ నెల 12, 13, 14 తేదీలలో భాజపా ఆధ్వర్యంలో వివేకానంద కబడ్డీ టోర్నమెంట్ జిల్లాస్థాయి స్త్రీలు, పురుషుల టోర్నమెంట్ నిర్వహించు టకు ఏర్పాట్లను ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్.మాధవ్, బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అనకాపల్లి ఇంచార్జ్ ఎస్ వి ఎస్ ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సహ కార్యదర్శి వి.శ్రీనివాస రావు, షిప్పింగ్ కార్పొరేషన్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్ చక్రవర్తి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రసాద్ కొప్పిశెట్టి, పాలిమేర శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు భోగాది స్వామినాయుడు, కార్యదర్శి ధానేష్, ఎస్సీ మోర్చా నాయకులు విజయ్ మొదలగు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.



# అదనపు కమిషనర్ శ్రీనివాస్ కు.. అభినందనలు తెలియజేసిన వివేకానంద సంస్థ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అదనపు కమిషనర్ శ్రీనివాస్ కు.. వివేకానంద సంస్థ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని.. ఆకాంక్షను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాన్నిఆయనకు బహూకరించారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, భవాని, సుజాత,ఉమాదేవి ఆయనను కలిసిన వారిలో ఉన్నారు..

# గొలుగొండ మండలంలోని ప్రధాన సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే

గొలుగొండ (విజయభాను న్యూస్) : నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ గొలుగొండ మండలం ప్రధాన సమస్యలపై విశాఖ జిల్లా కలెక్టర్‌ను కలవడం జరిగిందని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గొలుగొండ మండలంలో ఆరిలోవ ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణంపై కలెక్టర్‌ను, ఫారెస్ట్ అధికారులను, ఆర్అండ్‌బి ఉన్నతాధికారులను సమన్వయ పరిచే దిశగా మాట్లాడి పనులు ప్రారంభించేందుకు తగు ఆదేశాలను జారీ చేసేందుకు

కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. త్వరలోనే వర్క్ ఆర్డర్ మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.



గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు

అలాగే పిహెచ్‌సి, రైతు భరోసా కేంద్రం సమస్యలపై కూడా కలెక్టర్‌తో చర్చించడం జరిగిందన్నారు.

మండల సమస్యలపై శ్రద్ధ వహించి పరిష్కారం దిశగా పనిచేస్తున్న ఎమ్మెల్యే గణేష్‌కు మండల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా మన్నారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి ఇటీవల పంపిన దేవాలయాల ప్రతిపాదనలు, చీడిగుమ్మల రామాలయం ప్రారంభం కోసం ఎండోమెంట్ కమిషనర్‌ను కూడా కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మండల అభివృద్ధికి నిరంతరం కృషికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

# ప్రతి భారతీయుడు చదవాల్సిన గ్రంథం భారత రాజ్యాంగం

- ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.రమణ

దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : భారతీయులందరూ చదవాల్సిన ఏకైక గ్రంథం భారత రాజ్యాంగం అని విద్యార్థినీ విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వి. రమణ సూచించారు. మండల కేంద్రం స్థానిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగం పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కె.వి. రమణ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే చట్టాలపై భారత రాజ్యాంగంపై అవగాహన తప్పక కలిగి ఉండాలని అలా ఉన్నప్పుడే మన దేశ అభివృద్ధికి మనం సైతం మార్గదర్శకాలు కాగలమని ఆయన విద్యార్థినీ, విద్యార్థులను, ఆకాంక్షించారు. అందువల్ల విద్యార్థులు తమ తల్లిదండ్రులు చెప్పినటువంటి సూచనలు పాటిస్తూ ఉపాధ్యాయుడు చెప్పే పాఠాలను శ్రద్ధగా ఆలకించి సమాజంపై విజ్ఞానాన్ని పెంపొందించే దిశగా రాజ్యాంగ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వర్మ, సచివాలయం మహిళా పోలీస్ వరలక్ష్మి, మండల కార్యదర్శి కే. శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు ఆందోళన

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : మాకవరపాలెం కేజిబివిలో ఉపాధ్యాయులను నియమించాలని శుక్రవారం తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ప్రస్తుత ఈ సంవత్సరం చదువుతున్న పిల్లలందరికీ ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ సంబంధించి ఉపాధ్యాయుల కొరత ఉందని, దీంతో సిలబస్ పూర్తి కాలేదని ఆందోళనకు దిగారు.



# విజయభాను సంపాదకీయం

## వణికిస్తున్న ఒమిక్రాన్

కోవిడ్ కొత్త రకం 'ఒమిక్రాన్' ప్రపంచ దేశాలను తారెత్తిస్తోంది. రెండేళ్ల క్రితం బయల్పడిన కోవిడ్-19 అతలాకుతలం చేయగా రెండవ ఉధృతిలో డెల్టా వేరియంట్ సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. ఆ ఉపద్రవం నుండి ప్రపంచం పూర్తిగా కోలుకోకమునుపే దక్షిణాఫ్రికాలో కొత్తగా కనుగొన్న బి.1.1.529 (ఒమిక్రాన్)తో కలకలం రేగింది. అసాధారణ మ్యుటేషన్ల కలయికగా ఒమిక్రాన్‌ను వైద్య పరిశోధకులు పేర్కొనడమే కాకుండా డెల్టా వేరియంట్ కంటే అత్యంత ప్రమాదకారి అని ప్రాథమికంగా నిర్ధారించారు. దక్షిణాఫ్రికాలో గుర్తించిన ఒమిక్రాన్ స్వల్ప సమయంలోనే ఐరోపా దేశాలకు వ్యాపించింది. జర్మనీ, బ్రిటన్, ఇజ్రాయెల్, బాట్స్‌వానా, హాంకాంగ్, ఆస్ట్రేలియాలలో ఒమిక్రాన్ కేసులు బయట పడ్డాయి. అప్రమత్తమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒమిక్రాన్‌ను ఆందోళనకర వేరియంట్‌గా ప్రకటించి అంతర్జాతీయ ప్రయాణాలపైన కఠిన ఆంక్షలు విధించాలని, వైరస్ కట్టడి చర్యలు చేపట్టాలని, వ్యాక్సినేషన్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించింది. ఆగేయాసియా దేశాలు మరింత అప్రమత్తంగా ఉండాలని దిశా నిర్దేశం చేసింది. ఆలస్యంగా మేల్కొన్న భారత ప్రభుత్వం యథామామూలుగానే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచనలు చేస్తూ లేఖలు పంపించి చేతులు దులుపుకుంది. అంతర్జాతీయ విమానాల రాకపోకలపై ఇప్పటికైతే అచేతనావస్థలోనే ఉంది. ముంబయిలో ఒమిక్రాన్ కేసు నమోదైందన్న వార్త దేశాన్ని మరింత భయకంపితులను కావించింది.

కోవిడ్ రెండవ దశ ఉధృతికి మోడీ ప్రభుత్వ అలసత్వమే కారణమన్న వాస్తవం ప్రజలకు తెలిసిందే. వైరస్ ఆట ముగిసిందని స్వయాన అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి ప్రకటించి ముందస్తు సన్నద్ధతకు గండి కొట్టారు. సెకండ్ వేవ్ సృష్టించిన విపత్తును తలచుకుంటేనే జనం యావజ్జీవాలు కుంగుతాయి. ఆక్సిజన్ లేమి, వైద్య సదుపాయాల కొరత, అరకొర టీకాలు ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా చేశాయి. ప్రతి రోజూ లక్షల్లో పాజిటివ్ కేసులు, వేలల్లో మరణాలు జనాన్ని వణికించాయి. అనాలోచిత లాక్‌డౌన్లతో లక్షలాది వలస కూలీలు, పేదలు అన్నమో రామచంద్రా అని విలపించారు. కోవిడ్‌తో కుటుంబాలకు కుటుంబాలనే పోగొట్టుకున్న అభాగ్యులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించే విషయంలో కేంద్రం భీష్మించగా సాక్షాత్తు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ తన ప్రత్యేక నిధులను కాకుండా రాష్ట్రాలు తమకు కేటాయించిన విపత్తు సహాయ నిధి నుండి బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వమంది. ఒక్క పరిహారం విషయంలోనే కాదు. వైద్య సదుపాయాలకు సైతం రాష్ట్రాలకు కేంద్రం నిధులిచ్చింది లేదు. వైరస్ కట్టడి, సహాయ చర్యలు తీసుకోవాలని ఉచిత సలహా ఇచ్చిందంతే. ఇప్పుడు ఒమిక్రాన్ రూపంలో మూడవ ముప్పు పొంచి ఉందంటూ వెలువడుతున్న సంకేతాల నేపథ్యంలో సైతం కేంద్రం ప్రేక్షక పాత్ర వహించడం బాధ్యతా రాహిత్యం.

ఇప్పటికైతే ఒమిక్రాన్ వ్యాప్తి వేగం, అది కలిగించే తీవ్ర ఆరోగ్య లక్షణాలపై పరిశోధనాత్మకంగా నిర్ధారణ కానప్పటికీ గతంలో ఎదురైన పరిణామాల రీత్యా ముందస్తు సన్నద్ధతకు కేంద్ర ప్రభుత్వం వేగంగా కదలాల్సిన అవసరం ఉంది. అటువంటి చిత్తశుద్ధి మోడీ సర్కారులో లోపించింది. పోషకాహారం విషయంలోనూ, ఆకలి సమస్యలోనూ మన దేశం ఎక్కడో అట్టడుగున ఉందని ప్రపంచ స్థాయి ర్యాంకింగ్ సంస్థలు కుండబద్దలు కొట్టాయి. ప్రజల తలసరి ఆహార వినియోగం ఏడేళ్ల బిజెపి జమానాలో ఏకంగా తొమ్మిది శాతం తగ్గిపోయిందని ఎన్ఎస్ఎస్ సర్వే బట్టబయలు చేసింది. కరోనా వేరియంట్లను ఎదుర్కోవాలంటే ప్రజల్లో రోగ నిరోధక శక్తి ఉండాలి. కోట్లాది మంది ఆకలితో అలమటిస్తున్న వేళ వారిలో ఇమ్యూనిటీని ఆశించడం వంచన. వ్యాక్సిన్ రెండు డోసులూ తీసుకున్న వారిలో సైతం ఈ ఒమిక్రాన్‌ను నిరోధించే శక్తి ఎంత ఉంటుందనేది ప్రశ్నార్థకమని నిపుణులు అంటున్నారు. ఇక వ్యాక్సిన్‌కు ఇంతవరకూ నోచుకోని వారి పరిస్థితి ఏమిటి? వ్యాక్సినేషన్ మొదలై 11 నెలలు గడిచినా మూడవ వంతు జనానికి పూర్తి స్థాయిలో టీకాలు అందలేదు. ఈ వైఫల్యం ముమ్మాటికీ కేంద్రానిదే. తతిమ్మా రాష్ట్రాలు ఒమిక్రాన్, మూడవ దశపై వేగంగా అప్రమత్తవుతుండగా మన రాష్ట్ర ప్రభుత్వం ఇంకా సమీక్షలకే పరిమితమైంది. మరి కార్యాచరణ ఎప్పుడు? రెండవ దశ ఎ.పి లో ఎంతగా భయోత్పాతం కలిగించిందో చూశాం. ఒమిక్రాన్ కట్టడిపై రాష్ట్రం యుద్ధ ప్రాతిపదికన అప్రమత్తం కావాలి. నిధులు, వైద్య సహాయ సహకారాలపై కేంద్రాన్ని నిగ్గదీసి నిలదీసి సాధించాలి.

## కాలుష్య నియంత్రణకు అడవులు దోహదపడతాయి



కంచరపాలెం : పర్యావరణ పరిరక్షణ,కాలుష్య నియంత్రణకు అడవులు ఎంతగానో దోహదం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్స్ గుజ్జు వెంకటరెడ్డి పీతల వాసు,వనం వరలక్ష్మి దేవుడు అన్నారు. ఈమేరకు రాష్ట్రంలో ప్రముఖ అటవీ ప్రాంతాలు నర్సీపట్నం. చింతపల్లి, ఆరుకు ఆర్వీ నగర్ పాడేరు ప్రాంతాలను సహచర డైరెక్టర్లు అటవీ శాఖాధికారులతో కలిసి సందర్శించారు.క్షుణ్ణంగా అటవీప్రాంతాలను పరిశీలించిన అనంతరం సహచర డైరెక్టర్ లతో కలిసి అధికారులకు అడవుల పరిరక్షణకు తగిన సూచనలు చేసారు. ప్రస్తుత పరిస్థిల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, కాలుష్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని అడవుల్లో మొక్కలపెంపకాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో నర్సీపట్నం డివిజనల్ మేనేజర్ ఎమ్.స్వర్ణలత, అసిస్టెంట్ ప్లాంట్ మేనేజర్లు దుర్గాభవాని,వెంకట సుధ, చింతపల్లి దివిజనల్ మేనేజర్ సత్యం,చింతపల్లి డివిజన్ సూపర్వైజర్ అప్పారావు వైసీపీ నాయకుడు ఊటగెడ్డ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1260 కోట్లతో జెడ్పీ బడ్జెట్ ఆమోదం




శ్రీకాకుళం, విజయ భానున్యూస్ : రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రభుత్వ సంక్షేమ అభివృధి కార్యక్రమాలు అందజేయడం జరుగుతుందని ఉప ముఖ్య మంత్రి ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 2021-22 సంవత్సరం సవరణ బడ్జెట్ మరియు 2022-23 సంవత్సరం అంచనా బడ్జెట్ 2021-22 సంవత్సరం సవరణ బడ్జెట్ లో ఆదాయం రూ 1221 కోట్ల,15 లక్షలు వ్యయంగా రూ. 1091 కోట్ల 70 లక్షలు మరియు మిగులు నిధులు రూ. 129 కోట్ల 44 లక్షలు, 2022-23 సంవత్సరం అంచనా బడ్జెట్ ఆదాయం రూ 1260 కోట్ల 16 లక్షలు, వ్యయం రూ.1102 కోట్ల 95 లక్షలు మరియు మిగులు నిధులుగా సమర్పించిన 1వ స్థాయి సంఘం సర్వసభ్య సమావేశం ఆమోదం నిమిత్తం సభలో ప్రవేశ పెట్టడం జరిగింది. సభ పూర్తి స్థాయిలో ఆమోదం తెలిపింది. అనంతరం 2021-22 సంవత్సరం సవరణ బడ్జెట్, 2022-23 సంవత్సరం అంచనా బడ్జెట్ ఆమోదం కొరకు సభలో బడ్జెట్ వివరాలు ప్రవేశ పెట్టడం జరిగింది. బడ్జెట్ ఆదాయ వ్యయాలకు సంబంధించి శాఖల వారీగా వివరించారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియ విజయ సాయి రాజ్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సూచనలకు మేరకు విద్యా, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందన్నారు. జిల్లా జనాభా ఆధారంగా ప్రభుత్వం నిధులను కేటాయించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్, ప్రస్తుత ఏడాది సవరణ బడ్జెట్‌లో ఆదాయ వ్యయాలు, గ్రాంట్లును, ఏయే పద్దులకు ఎంతమేరకు ఖర్చు చేస్తున్నదీ తదితర అంశాలను, జెడ్పి ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.లక్ష్మి పతి సభకు వివరించారు.

బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ముందుగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1వ స్థాయీ సంఘం సమావేశం జరిగింది. ప్రతిపాదిత బడ్జెట్, సవరణ ఈ సమావేశంలో చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పాతపట్నం శాసన సభ్యులు రెడ్డి శాంతి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వర రావు, రాష్ట్ర తూర్పు కాపు, కళింగ కోమటి, మహిళా కార్పొరేషన్ల చైర్మన్ లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరి బాబు, బి. హేమమాలిని రెడ్డి, జెడ్పి వైస్ ఛైర్మన్లు సిరిపురం జగన్మోహన రావు, పి.శ్రావణి, వివిధ మండలాల జెడ్పిటిసి, సభ్యులు, ఎం.పి.పిలు, అధికారులు పాల్గొన్నారు.

## అన్నూర్ ప్లేస్కూల్ లో సంక్రాంతి వేడుకలు ..



కంచరపాలెం విజయ భానున్యూస్ : గ్రేటర్ విశాఖ 53 వ వార్డు పరిది మర్రిపాలెం పార్వతి నగర్ వద్ద నున్న అన్నూర్ ప్లేస్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు . వేడుకల్లో బాగంగా పాఠశాల ఆవరణలో చిన్నారులు సాంప్రదాయ దుస్తులతో అలరించారు. అనంతరం చిన్నారులకు సంక్రాంతి పండుగ గురించి వివరించి చిన్నారులకు గాలి పటాలు , మిఠాయిలు అందజేసారు . కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ ఫరీద్ షేక్, ప్రిన్సిపల్ షహరత్ బీబీ పర్యావేక్షించారు . కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ విజయసాయి రెడ్డికు ఘన స్వాగతం



గాజువాక :(విజయభాను న్యూస్ ): విశాఖపట్నం విమానాశ్రయంలో రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర వైయస్ఆర్సిపి ఇన్చార్జ్, వైఎస్ఆర్సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, వి.విజయ సాయి రెడ్డికు గాజువాక వైయస్ఆర్సిపి ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి , 74వ వార్డ్ కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి లు స్వాగతం పలికారు.

ఆయనకు శాలువా వేసి, పుష్పగుచ్చానిచ్చి స్వాగతం పలికారు. వారితో పాటు 66వ వార్డ్ కార్పొరేటర్ మొహమ్మద్ ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

## మాడుగుల, కేజే పురం లో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్



వి మాడుగుల (విజయభాను న్యూస్) : మండలంలోని మాడుగుల, కేజే పురం గ్రామాల్లో గురువారం 104 అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో భవాని, ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో వ్యాధుల తీవ్రత పెరుగుతుందని అందువలన మెగా మెడికల్ క్యాంపు లు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం మాడుగుల, కేజే పురం గ్రామాల్లో నిర్వహించిన మెడికల్ క్యాంపు ద్వారా 405 మంది రోగులకు వైద్యం అందించామన్నారు. 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అందరి రోగులకు మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సోము దొర, భార్గవ్ సింహాచలం నాయుడు, ఏఎన్ఎంలు అచ్యుతం బ, సర్వ లక్ష్మి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాష్ నగర్ హై స్కూల్ ను ఆకస్మికంగా పరిశీలించిన 61వార్డ్ కార్పొరేటర్



ములగాడ : (విజయభాను న్యూస్ ): పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 61 వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శుక్రవారం ప్రకాష్ నగర్ హై స్కూల్ ను ఆకస్మిక పర్యటన చేసి మధ్యాహ్న భోజన పథకం గురించి విద్యార్థినీ విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. వారితో పాటే భోజనం రుచి చూసి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మధ్యాహ్న భోజన పథకం విద్యార్థినీ విద్యార్థులకు ఏ లోటు లేకుండా చూడాలని హై స్కూల్ హెడ్ మాస్టర్ సూచించడమైనది.

ఈ కార్యక్రమంలో పారి శ్రామిక ప్రాంత ఇన్చార్జ్ దాడి సత్య నారాయణ వార్డు ప్రెసిడెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

సంకీర్తన

రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీత వృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీన జాతి వాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రితరక్షణ వల్ల లభించినయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్న వాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరిం పచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవం తుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మ వంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్న వాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా - సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ-భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది.

వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి.

మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమానమైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.



# ఎన్నికల్లో వైకాపాకు వ్యతిరేకంగా దళితులు పోటీచేస్తే చంపేస్తారా?

## దళితులకు రాష్ట్రంలో బ్రతికే హక్కు లేదా?

### తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్



విశాఖపట్నం, (విజయ భాను న్యూస్) : వైకాపా ప్రభుత్వం వచ్చాక దళితులపై అరాచకాలకు పోలీసులను ప్రయోగిస్తుంది.

దళితుల ఓట్లతో గద్దె నెక్కిన మీరు ఆ దళితు లనే చంపుతారా?

చీరాలలో కిరణ్ ,విశాఖలో డాక్టర్ సుధాకర్, నేడు తూర్పు గోదావరి లో గిరీష్ లను వైకాపా ప్రభుత్వం పొట్టన బెట్టుకుంది.

తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలోని బలుసులపేటకు చెందిన దళిత యువకుడు ఆలపు గిరీష్‌బాబు ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. ఎన్నికల్లో వైకాపాకు వ్యతిరేకంగా అన్న ప్రవీణ్ పోటీ చేయడంతో తన తమ్ముడి పై తప్పుడు కేసు పెట్టించి, చిత్రహింసలకు గురిచేయడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్నికల్లో వైకాపాకు వ్యతిరేకంగా పోటీ చేస్తే రాష్ట్రంలో బ్రతకనివ్వరా? లారీకి రబ్బరు కట్టి, కాళ్ల మీదే కొట్టడం ద్వారా రాక్షస ఆనందం పొందమని ఏచట్టం చెబుతుందో రాష్ట్ర డి.జి.పి సమాధానం చెప్పాలి. గిరీష్‌పై వాలంటీర్ పెట్టింది పెట్టీ కేసు కాగా... ఎస్పై ఎవరిని సంతృప్తి పర్చడం కోసం ఆ పిటిషన్‌ను మార్చి కేసు పెట్టారు? ఎస్పై ఏకపక్షంగా, కక్షపూరితంగా, ఏనాయకుల మెప్పు కోసం దళిత యువకుడ్ని పొట్టన పెట్టుకున్నారు? ఎస్పైని 24 గంటల్లో డిస్మిస్ చేయాలి.ఎస్పై కాల్ డేటా ఆధారంగా అతన్ని ప్రభావితం చేసిన వైకాపా నాయకులను అరెస్టు చేయాలి.

బలుసులపేట ఘటనకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్పై బి.అభిమన్యును వీఆర్‌కు పంపడమేమిటి? ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం క్రింద తక్షణమే అరెస్టు చేసి ,ఉద్యోగంనుండి తొలగించాలి.

గిరీష్ కుటుంబానికి 50 లక్షల నష్ట పరిహారం మరియు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.దళితులకు సంక్షేమ పథకాలు లేకుండా చేశారనుకుంటే వైకాపా పాలనలో మీకు బ్రతికే హక్కే లేదంటూ పోలీసులతో చంపేస్తున్నారు.

# నేడు టీడీపీ నిరసన

## మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపు



పాడేరు (విజయభాను న్యూస్) తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ నిరసన పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో

శనివారం తెలుగుదేశం పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు జరపాలని ,రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఇదివరలో తుఫాను కారణంగా తడిసి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు జరపాలని, రైతులు సాగుచేస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లతో కలిసి రైతులపై దోపిడీ ఆపాలని డిమాండ్ చేస్తూ ...

ఈ కార్యక్రమం నియోజకవర్గంలో ఉన్న అన్ని మండల కేంద్రాలలో ఉన్న టీడీపీనాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని ఆయా మండలాల్లో విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఆ మూగజీవాల రోదన అరణ్య రోదనగా మిగిలింది..







పాడేరు (విజయభాను న్యూస్) : .గురువారం అర్ధరాత్రి పశువులను తరలిస్తున్న పెద్ద లారీ పాడేరు ఘాట్లోని లోయలో బోల్తాపడింది. పాడేరు మండలం రాజాపురం- పనెండువ మైలు మధ్యలోని మలుపువద్ద పశువులను తరలిస్తున్న లారీ బోల్తాపడింది. పరిమితికి మించి మూగజీవాలను తీసుకొని వెళ్లడంతో పాటుగా లారీ పొడవు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్పష్టమౌతుంది. ఈ ఘటనలో కొన్ని పశువులు చనిపోగా, మరికొన్ని చెట్ల మధ్య ఇరుక్కుపోయి ఆర్తనాదాలు చేస్తున్నాయి. కాగా ప్రమాద ఘటనలో లారి డ్రైవర్, క్లినర్ లకు గాయాలు అయ్యాయా, ప్రాణాపాయంలో ఉన్నారా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఘటన జరిగిన వెంటనే గాయాలపాలైన పశువులను హుటాహుటిన అక్కడనుండి మరో ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. చెట్ల మధ్య ఇరుక్కున్న పశువుల ఆక్రందన అరణ్య రోధనగా మారిందని చెప్పవచ్చు. పాడేరు ఘాట్లో పశువులు తరలిస్తున్న వాహనం బోల్తాపడ్డ విషయం తెలుసుకున్న భారతీయ జనతా యువమోర్చా నేతలు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలుపాలైన మూగజీవాలకు సపర్యలు చేసారు, అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ బాద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ బదిలీ

మాకవరపాలెం (విజయభాను న్యూస్): మాకవరపాలెం పశు వైద్యాధికారి దుర్గాప్రసాద్ బదిలీ అయ్యారు. ఈయన మాకవర పాలెంలో సుమారు ఆరు సంవత్సరాలకు పైగా పశువైద్యాధికారిగా సేవలందించారు. ఏళ్ల తరబడి బిసి కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో పశువైద్య కేంద్రాన్ని నిర్వహించేవారు. దీంతో ఉన్నతాధికారులతో చర్చించి మండల పరిషత్ కాంప్లెక్స్ సమీపంలో గల ప్రభుత్వ స్థలాన్ని పశువైద్య కేంద్రం నిర్మాణానికి మంజూరు చేసే విధంగా ఆయన కృషి చేశారు. ఈయన కొయ్యూరు మండలం డౌనూరుకు బదిలీ అయ్యారు. అదే విధంగా రాచపల్లి పశువైద్యాధికారి పెట్ల నరేష్ కూడా కోటవురట్ల మండలం పాములవాకకు బదిలీ అయ్యారు. సుమారు రెండున్నరేళ్ల పాటు ఆయన ఇక్కడ సేవలందించారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగును తొలగించి పూలమాలలతో ఘన నివాళులు



అన్నవరం(విజయభాను న్యూస్) : సుమారు సంవత్సర కాలంగా స్థానిక ఎన్నికల సమయంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి వేసిన ముసుగును తొలగించని విషయాన్ని పత్రికా ముఖంగా పంచాయతీ అధికారుల నిర్లక్ష్య ధోరణిని ఖండించి, పై అధికారులకు ఫిర్యాదు చేస్తాము అని స్థానిక తెలుగుదేశం నాయకులు తెలియజేయడం తో, అన్నవరం గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ముసుగును తొలగించిన విషయమై హర్షం వ్యక్తం చేస్తూ, మహనీయుల విగ్రహాలకు ముసుగు తొలగించే విషయంపై అధికారులు అలసత్వం వహించకూడదని తెలియజేస్తూ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు . కార్యక్రమం లో కాకినాడ పార్లమెంట్ కార్యదర్శి సరమర్ల మధుబాబు రాయి శ్రీనివాస్, కడుపుకట్ల కృష్ణ, అమలాపురం సత్తిబాబు, పంచదార్ల సత్తిబాబు, చీటికిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శారదా విద్యాలయంలో సంక్రాంతి వేడుకలు



అన్నవరం (విజయభాను న్యూస్) : తూర్పుగోదావరి జిల్లా అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు నందు ఉన్న శ్రీ శారదా విద్యాలయం నందు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.ముందుగా స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ కృష్ణ వర్మ మాట్లాడుతూ ఈ సంక్రాంతి అందరి జీవితాలలో నూతన వెలుగులు నింపాలని కొరుకుంటూ విద్యార్థులకు,అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసారు.అనంతరం విద్యార్థులు భోగి మంటలు.గొబ్బెమ్మ లతో అత్యంత సర్వాంగ సుదరంగా అలంకరించారు.చిన్నారుల కోలాటం,జోడు గిత్తల పరుగు పందెములు ఎంతగానో అలరించాయి.పండుగ విశిష్టతను చాటుతూ చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. హిందూ సాంప్రదాయ వస్త్ర దారణలో పిల్లలు ఎంతో ముద్దులొలికించారు.ప్రస్తుత కాలంలో కనుమరుగు అవుతున్న హరిదాసు, జంగర దేవర,బుడబుక్కల వేషదారణ లు ఆకర్షించాయి. అనంతరం రంగ వల్లుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామస్థులు స్కూల్ ప్రిన్సిపల్ బోనగిరి. శ్రీనివాసరావు,పిఇటి కోళ్ళ.సూరిబాబు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వనదుర్గమ్మ వారి ఆలయంలో ఘనంగా చండీ హోమం



అన్నవరం (విజయభాను న్యూస్) :తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువై యున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హోమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం,అమ్మవారికి మూల, మంత్ర జపములు,సప్తశతి పారాయణములు నిర్వహించారు.11 గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోట.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు చల్లపల్లి .ప్రసాద్ శర్మ,చిట్టెం. వాసు,చిట్టెం. నగేష్,కూచిభట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు,అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది, భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదములు అందజేశారు.

## అవగాహన కార్యక్రమం

భీమునిపట్నం (విజయభాను న్యూస్): జివియంసి జోన్ ఒన్ భీమిలి పరిధి లో స్వచ్ఛ సర్వేక్షణ 2022 లో భాగంగా కమీషనర్ ఎస్. వెంకట రమణ ఆదేశాల ప్రకారం అన్ని వార్డులలో పరిసరాల పరిశుభ్రత ఇంటి ఇంటి నుండి చెత్తలను తడి పొడి మరియు ప్రమాదకరమైన వ్యర్ధములుగా వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి అందించుటకు గాను మరియు ఇంటి వద్దనే సెంద్రీయ ఎరువు తయారు చేయుటకు గాను ఒక సారి వినియోగించి పడేసి ప్లాస్టిక్ నిషేదం కొరకు యూజర్ చార్జీలు సకాలములో చెల్లించాలని పలు అంశాలపై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు అలాగే మూడవ వార్డ్ లో బీచ్ రోడ్ లో లైట్ హౌస్ వద్ద మానవహారం స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వ హించారు. అలాగే స్థానిక నెహ్రూ స్కూల్ లో విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షణ 2022 పై అవగాహనా మరియు వ్యాసరచన పోటీ నిర్వహించారు ఈ కార్యక్రమం లో జోనల్ కమిషనర్ ఎస్ వెంకట రమణ శానిటరీ ఇన్ స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు సంబంధిత వార్డు సెక్ర టరీలు పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో పరవశించిన కొత్తపెంట

**- అంగరంగ వైభవంగా దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం**

**- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం**

**- ఆకట్టుకున్న మహాత్ముల ప్రవచనాలు**




దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : మండలంలోని కొత్తపెంట గ్రామం ఆధ్యాత్మిక చింతనతో పరవశించిపోయింది. అంగరంగ వైభవంగా సద్గురు శ్రీ దేవానంద సరస్వతి మహారాజ్ స్వామీజీ 22వ ఆరాధన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు నగర సంకీర్తన, భగవద్గీత పారాయణం, భక్తి గీతాలతో భజనలు,మహాత్ముల ప్రవచనాలతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. వడ్లపూడి ఆనందాశ్రమం పీఠాధిపతి రామకృష్ణానంద ప్రవచనం అత్యంత ఆసక్తిగా సాగింది. ఆయన ప్రవచనంలో మాటలు, పాటలు, చలోక్తులుతో భక్తులను ఆకట్టుకున్నారు. దేశ విదేశాల నుంచి దేవానంద స్వామీజీ భక్తులు, శిష్యులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీరితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది భక్తజనం తరలిరావడంతో స్వామి వారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ ప్రాంత రోడ్లన్నీ రద్దీగా మారాయి. ప్రభుత్వ విప్ బూడి ముత్యాల నాయుడు సతీమణి రమణమ్మ, జడ్పిటిసి కర్రి సత్యం, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు బూరె బాబూరావు,పార్టీ సీనియర్ నాయకులు ఆవుగడ్డ రామ్మూర్తినాయుడు, గ్రామ సర్పంచ్ రొంగలి వెంకటరావు (నీలిమ), మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ పి. సింహాచలం బందోబస్తు ఏర్పాటు చేశారు. వేచలం పీ హెచ్ సీ వైద్యాధికారులు బి హారిక, గోవింద్ రెడ్డి సారధ్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.స్వామి విష్ణుదేవా నంద సరస్వతీ సభాధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో దేవానంద స్వామి ఆధ్యాత్మిక జీవన సంఘం కమిటీ సభ్యులు కర్రి దేముడు, లెక్కల గంగు నాయుడు, పి ఎస్ కె నరసింగరావు, సి.హెచ్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



## ముషిడిపల్లిలో సంక్రాంతి సంబరాలు

**- అలరించిన రంగవల్లులు, గొబ్బెమ్మలు**



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : మండలంలోని ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం ఈ సంక్రాంతి సంబరాలు భోగిమంటలు, గొబ్బెమ్మలు, చెరుకుగడలు, గంగిరెద్దులతో సంక్రాంతి వేడుకలు కు అద్దం పట్టేలా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించి సాంప్రదాయ విలువలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు పెద్దల వెంకటరమణ, పద్మావతి, సుకన్య, సుజాత, భవాని, పిడి అప్పారావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## నిధులు ఇవ్వకుండా అడ్డుకున్న పిఆర్ డిఇ మరియు ఎంపీడీవోల వైఖరికి నిరసనగా

# సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు నిరసన దీక్ష కార్యక్రమం



అరకులోయ (విజయభాను న్యూస్) : మండలం లోని సుంకరమెట్ట పంచాయతీ లో అర్బన్ నిధులు ఇవ్వకుండా అడ్డుకున్న పిఆర్ డిఇ మరియు ఎంపీడీవోల వైఖరికి నిరసనగా.. సుంకరమెట్ట పంచాయతీ సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు నిరసన దీక్ష. మండల పరిషత్ కార్యాలయం ఎదుట సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్న బాబు ఒక్కరోజుదీక్ష చెప్పటారు ఈ దీక్ష ప్రారంభకులు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కిల్లో సురేంద్ర సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు ప్రారంభించరు దీనికి ముందు మర్రి కామయ్య విగ్రహానికి గెమ్మెలి చిన్నబాబు సుంకరమెట్ట సర్పంచ్ పూలమాల వేసి అరకు వేలి మండలంలో 11 పంచాయతీ పరిధిలో రు అర్బన్ నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయించగా పది పంచాయతీలకు మాత్రమే నిధులు వైసిపి నాయకులు అధికారుల ఒత్తిడి చేసి కేటాయించడం జరిగిందనారు సుంకరమెట్ట పంచాయితీలో రూ అర్బన్ నిధులు రాజకీయ కక్షపూరితంగా కేటాయించకపోవడం దారుణమన్నారు సుంకరమెట్ట పంచాయతీ ప్రజల అభివృద్ధికి కి అరకు వేలి మండల వైసిపి ప్రజాప్రతినిధులు అధికారులకు వత్తిడి చేసి నిధులు కేటాయించకుండా అడ్డుకోవడం సరికాదు అన్నారు. పంచాయతీ నిధులు కేటాయించిన విధంగా సుంకరమెట్ట పంచాయతీకి కూడా నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు .పంచాయతి నుండి గెలిచిన ఎంపీటీసీ వైస్ ఎంపీపీ గా ఉన్నప్పటికీ మా పంచాయతీ కి న్యాయం చేయకపోవడం బాధాకరంఅన్నారు రూ అర్బన్ నిధులు కేటాయింపు పంచాయతీకి జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యే గారు జోక్యం చేసుకొని మా సుంకరమెట్ట పంచాయతీకి నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామనారు .న్యాయంజరగకపోతేమరింత ఆందోళన చేస్తామన్నారు. పెదలబుడు పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాజకీయ వత్తిడి అధికారులకు పెరిగిందని అన్నారు అందులో రూ అర్బన్ నిధులు కేటాయించకపోవడంతో సుంకర మెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు ఈరోజు కూర్చోన్న దీక్షకు తెలుగు దేశం పార్టీ గా సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని అన్నారు .అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించవలసిందిగా ప్రభుత్వానికి ప్రజాప్రతినిధుల కు కోరారు, మండల రాజకీయ నాయకులు సుంకమెట్ట పంచాయతీకి రూఅర్బన్ నిధులు కేటాయించక పోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి సుంకరమెట్ట పంచాయతీలో రూఅర్బన్ నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇటువంటి నియంత పాలన కొనసాగితే రాజకీయ అరాచకత్వం పెరుగుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సిహెచ్ గురుమూర్తి సిహెచ్ ప్రసాద్ ,కేశవ్ ,మహాదేవ్, పి.రాజు, సిఐటియు నాయకులు పి బాల దేవ్, గిరిజన సంఘం నాయకులు పి.రామన్న,సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే. రామారావు పద్మాపురం పంచాయతీ సర్పంచ్ జన్ని భగత్ రామ్,చొంపి వార్డు మెంబర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



# 22 కొత్త బోర్లు ఏర్పాటు



గొలుగొండ (విజయభాను న్యూస్): మండలంలో మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు కు వచ్చిన నిధులను ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తామని గొలుగొండ ఎంపిపి గజ్జెలపు మణికుమారి అన్నారు. మండల పరిషత్ నిధులు ద్వారా మండలంలో 22 కొత్తగా బోర్లు ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గొలుగొండ పంచాయతీ పేటమాలపల్లి గ్రామంలో తాగునీటి బోరు తవ్వకానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లెక్కల సత్యనారాయణ, ఎంపిటిసి చేపల పాప, జెఇ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## గిరి విద్యార్థులను

# క్రీడా రంగంలో మరింత ప్రోత్సహించాలి



**అధికారులతో మాట్లాడుతున్న అరకు ఎంపి మాధవి**

కొయ్యూరు (విజయభాను న్యూస్) : గిరి విద్యార్థులను క్రీడా రంగంలో మరింత ప్రోత్సహించాలని అరకు ఎంపి గొడ్డేటి మాధవి అన్నారు. శుక్రవారం ఆమె జిల్లా క్రీడా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపి మాధవి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకం ఉండాలన్నారు. ఈ దిశగా అధికారులు దృష్టిసారించాలన్నారు. అరకులో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని, పాడేరులో అసంపూర్తిగా ఉన్న ఆర్చరీ స్టేడియం పూర్తి చేయాలని సూచించారు.

# ముగిసిన యువజన క్రీడా పోటీలు

## - విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన యోజన క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్లాక్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన పి ఈ టి లకు మెమొంటో అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి జి. మహేశ్వర రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వర్మ,ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చంద్రశేఖర కొటనా రాంబాబు మాస్టర్, ప్రభుత్వ పాఠశాల పి. డి నాగేశ్వరరావు, సి ఆర్ పి ఆదిరెడ్డి ఈశ్వరరావు, కోటి, పి డి అప్పలనాయుడు, లక్ష్మీ, నందు తదితరులు పాల్గొన్నారు.

# 20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

గొలుగొండ ((విజయభాను న్యూస్) : గొలుగొండ మండలం ఏటిగైరంపేటలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు గొలుగొండ ఎస్సై ధనుంజయ నాయుడు తెలిపారు. శుక్రవారం గ్రామంలో దాడులు నిర్వహించి ఎం.సోమరాజు అనే వ్యక్తి వద్ద 20 లీటర్ల సారా పట్టుకొని సోమరాజును అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# గిరిజన పాత్రికేయులు నిర్వహించిన వైద్య శిబిరాలకు

## విశేష స్పందన... పలువురు ప్రశంసలు..



పాడేరు (విజయభాను న్యూస్) : శాఖ ఏజెన్సీ పాడేరు ప్రాంతంలో పనిచేస్తున్న గిరిజన పాత్రికేయులు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఆశ్రమ పాఠశాలలో నిర్వహించగా రెండవ రోజు స్థానిక వారపు సంత కాఫీహౌస్ లో వైద్య శిబిరాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు స్థానిక గిరిజన పాత్రికేయుల డివిజన్ అధ్యక్షులు సూర్యారావు, మండల అధ్యక్షులు దుర్గారావు, కార్యదర్శి రామచంద్ర రావు, గౌరవ అధ్యక్షులు వెంకటరమణ కోశాధికారి సునీల్ తదితరుల సౌజన్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏజెన్సీ ఇన్చార్జి గంగరాజు ,అనిల్ నీరుకొండ డెంటల్ సైన్స్ వైద్య కళాశాల సహకారంతో ,ఐటీడీఏ సౌజన్యం తో ఏజెన్సీలో వైద్య శిబిరాలు విజయవంతంగా గిరిజన పాత్రికేయులు నిర్వహించారు. గిరిజన పాత్రికేయులు చేస్తున్న సేవలను పలువురు అభినందించి ప్రశంసించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పని చేసే పాత్రికేయులు గిరిజనుల కోసం సేవా కార్యక్రమం వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం చాలా గర్వకారణమని అభివర్ణించారు.

ఈ కార్యక్రమం అంతటికీ స్థానిక పాడేరు మండలం గిరిజన పాత్రికేయుల సహకారంతో డివిజన్ అధ్యక్షులు సూర్యారావు, పూర్తి బాధ్యత తీసుకొని సేవా దృక్పథంతో సంఘాన్ని ముందుకు నడిపిస్తున్నారని వారు చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు.

ఇటువంటి కార్యక్రమం మారుమూల ప్రాంతాల్లో కూడా చేసేందుకు సిద్ధపడుతున్నామని సంఘ సభ్యుల సహకారంతో ఏజెన్సీ అన్ని మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు ఐటీడీఏ ,పోలీస్ అధికారుల సహకారంతో చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. అనిల్ నీరుకొండ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది తో పాటు గిరిజన పాత్రికేయులు మోహన్ రావు, మహేష్, రాజారావు, జోషి ,సురేష్ కుమార్, రాజు రమణ ,శ్రీహరి ,గిరి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఐఐసి ప్యాకేజీపై సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి




అచ్యుతాపురం (విజయ భాను న్యూస్) : ఏపీఐఐసి ప్యాకేజీపై సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన 5 లక్షలు హామీని అమలు చేయాలని పూడిమడక వైసిపి నాయకులు చోడిపల్లి అప్పారావు అన్నారు. గురు వారం విశాఖలో మత్స్య శాఖామంత్రి సిదిరి అప్పల రాజును కలిసి వినతిపత్రం అందజేశారు . ఏపీఐఐసి పైప్ లైన్ ద్వారా ఫార్మా పరిశ్రమల రసాయన వ్యర్థ జలాలను పూడిమడక సముద్రంలోకి విడిచిపెట్టడం వలన మత్స్య సంపద నాశనమై మత్స్యకారులు ఉపాధి కోల్పోయారన్నారు . గత టిడిపి ప్రభుత్వం తప్పుడు జి ఓ ను తీసుకొచ్చి లక్షా 25 వేలు కొంతమందికి ఇచ్చారన్నారు . దీనిపై అప్పటి ప్రతిపక్ష నేత, నేటి సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పార్టీ అధికారంలోకి వస్తే 5 లక్షలు ప్యాకేజీ, ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారని మంత్రికి తెలిపారు. తమ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

వినతిపత్రం అందించినవారిలో వైసిపి నాయకులు మేరుగు అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

## ఉద్యోగుల ఆపద్బాంధవుడు

# ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి



అన్నవరం (విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉద్యోగుల ఆపద్భాంధవుడని ప్రకాశం జిల్లా యస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. రాష్ట్రంలో మద్యతరగతి వర్గానికి చెందిన తన లాంటి ఉద్యోగస్తులు రాష్ట్రంలజ లక్షలాదిమంది ఉన్నారని,

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వయోపరిమితి 62 సం. పెంచడం తనలాంటి వారికి ఎంతో మందికి ఊరటనిచ్చిందని శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విదంగా జగన్మోహన్ రెడ్డి ఐఆర్ 27% గతంలో ఇచ్చి ఉద్యోగుల భందువు అయితే వయోపరిమితి రెండు ఏళ్ళు పెంచి ఉద్యోగులు,వారి కుటుంభ సభ్యుల హృదయాలలో స్థానం సంపాదించారని అన్నారు. ఉద్యోగులకు కూడా మనసుందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు తమకు తెలుసని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఎక్కువ వ్యయం చేయడం, కోవిడ్ వలన రాష్ట్ర ఆర్థిక రాబడి పడిపోవడం, ప్రజా సంక్షేమానికి వ్యయం పెరగడం వలన ఫిట్మెంట్ 23% ఇచ్చినా రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తామని అన్నారు.

ప్రభుత్వానికి ఉద్యోగుల మద్దతు పూర్తిగా ఉంటుందని ప్రభుత్వ నిర్ణయంతో రెట్టించి ఉత్సాహంతో ప్రజల కోసం శ్రమించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో ఉద్యోగులకు ముందే సంక్రాంతి పండగ వచ్చిందని ప్రకాశం జిల్లా యస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు.

## ఘనంగా ఒక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్

భీమునిపట్నం(విజయభాను న్యూస్) : పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలి దివిస్ ఎం ఎన్ సి ఫార్మా డైరెక్టర్ ప్రాజెక్ట్స్ రావ్ దివిఅన్నారు.శుక్రవారం ఒక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ 13 వ వార్షకోత్సవం సందర్భంగా మూడవరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మన దేశాన్ని మన ప్రపంచాన్ని మరోసారి సస్య శ్యామల ప్రపంచంగా మార్చాలని ప్రతీ ఒక్కరనీ కోరు కోవడంతో పాటు విద్యార్థి లోకం భవిష్యత్ వాస్తు శిల్పులు గా ఉద్భవించే స్థాయి కి కృషి చేస్తున్న ఒక్రిడ్జ్ పట్ల అందరూ నిబద్ధులై ఉన్నారని తెలిపారు.ఆరో తరగతి చదువుతున్న ఎస్ నరసింహారెడ్డి కుంచే నుంచి, జీవం పోసుకున్న చిత్రాలు ఆహుతులను కట్టి పడేశాయి. ప్రకృతి అనే ఇన్నోవేటివ్ థీమ్ తో విద్యార్థుల్లో నైపుణ్యాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆర్ట్ ఎగ్జి బిసన్ జరిగింది.ఇందులో ఆరో తరగతి విద్యార్థి ఎస్ నరసింహారెడ్డి వేసిన ఏనుగు బొమ్మ, ఆర్యనా గ్రాండ్ చిత్రాలకు ప్రత్యేకించి ప్రశంసలు లభించాయి. వీటిని తిలకించిన ఒక్రిడ్జ్ తల్లి దండ్రులు, అతిథులు హర్షం వ్యక్తం చేశారు. జీవ కళ ప్రస్పుటించెలా చిత్రాలు ఉన్నాయంటూ అభినందించారు. తనని బాగా ప్రోత్సహించారు అంటూ బాల కళాకారుడు నరసింహ రెడ్డి చెప్తున్నాడు. విద్యార్థిని స్కూల్ ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి డైరెక్టర్ అమిత్ జైన్ లు భమిడి పాటి ప్రభాకర్ , టెక్నికల్ ఎడ్యుకేషన్ సీనియర్ ఫ్యాకల్టీ మేడ పాటి విశ్వ నాథ రెడ్డి తదితరులు అభినందిచారు.

# ఉత్కంఠంగా వైఎస్ఆర్ కప్ క్వార్టర్ ఫైనల్ పోటీలు

## - ప్రేక్షకులను అలరించిన బ్యాటింగ్ బౌలింగ్ విన్యాసాలు - సెమీస్ కు చేరుకున్న నాలుగు టీంలు





విశాఖపట్నం (విజయభాను న్యూస్): ప్రతిష్టాత్మక వైఎస్ ఆర్ కప్ మెగా క్రికెట్ టోర్నమెంట్ చివరి అంకానికి చేరువకాడంతో మ్యాచ్ లు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం 8 జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. చివరి ఓవర్ చివరి బంతివరకు ఉత్కంఠంగానే మ్యాచ్ లు జరిగాయి. 490 టీంలు, 500 మ్యాచ్ ల షెడ్యూల్ తో క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద టోర్నీగా గుర్తింపుపొంది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని విశాఖనగరంలో రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి ఆద్వర్యంలో గత నెల 21 న ప్రారంభమైన వైఎస్ ఆర్ కప్ మెగా క్రికెట్ టోర్నమెంట్ అద్యంతం క్రికెట్ అభిమానుల్ని అలరిస్తూ మొదటి దశ, పూల్ ఫైనల్ దశ, ప్రీక్వార్టర్ ఫైనల్ దశ విజయవంతంగా ముగించుకొని శుక్రవారం క్వార్టర్ ఫైనల్ దశకు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్ కూడా విజయవంతంగా ముగించుకొని సెమీఫైనల్ కు తలుపులు తెరిచింది.క్వార్టర్ ఫైనల్ లో మెదటి మ్యాచ్ అశోక్ వారియర్స్ మరియు పిఆర్ ఎన్ ఏ డి జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన పి ఆర్ ఎన్ ఏ డి-11 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అశోక్ వారియర్స్ జట్టు 8.1 ఓవర్లలో మూడు వికెట్లో కోల్పోయి 105 పరుగులు సాదించి విజయం సొంతం చేసుకుంది. 22 బంతుల్లో5 సిక్స్ లు , 2 ఫోర్ల సహాయంతో 47 పరుగులు చేసిన వాసుపల్లి మురళికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. మరో ఆటగాడు ఈశ్వరరావు 10 బంతుల్లో 3 సిక్స్ లు , 1 ఫోర్ సహాయంతో 26 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 24 బంతుల్లో 70 పరుగులు విలువైన బాగస్వామ్యం నమోదు చేసారు. అనంతరం రెండవ మ్యాచ్ ఎస్ వి ఎల్ ఎన్ టీం, అనకాపల్లి-11 టీంల మధ్య జరిగింది. మొదట బ్యాంటింగ్ చేసిన అనకాపల్లి టీం 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాంటింగ్ చేసిన ఎస్ వి ఎల్ ఎన్ టీం 6.3 ఓవర్లలో 5 వికెట్ల కోల్పోయి 81 పరుగులు చేసి విజయం సాధించింది. ఎస్ వి ఎల్ ఎన్ టీం ఆటగాడు పృథ్వి 8 బంతుల్లో 17 పరుగులు సాదించడంతో పాటు 23 పరుగులు ఇచ్చి 2 వికెట్ల సాధించినందుకు అతనికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. అనంతరం మూడవ మ్యాచ్ 2020 వెఎస్ ఆర్ కప్ టోర్నీ విజేత మద్దెలపాలెం-11 మరియు శ్రీ పెంటమాంబ టీంల మధ్య జరిగింది. టాస్ గెలిసి మద్దెలపాలెం టీం బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాంటింగ్ చేసిన శ్రీ పెంటమాంబ టీం నిర్ణీయ 10 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 111 పరుగులు సాధించింది. సాయిరాం 23 బంతుల్లో 5 సిక్స్ లు సహాయంతో 47 పరుగులు చేసి నాటౌల్ గా నిలిచాడు. మరో బ్యాట్స్ మ్యాన్ శివ 14 బుంతుల్లో2 సిక్స్ లు సహాయంతో 25 పరుగులు సాధించి నాటౌల్ గా నిలిచాడు. అనంతరం బ్యాంటింగ్ దిగిన మద్దెలపాలెం జట్టు 5 రన్స్ స్వల్పతేడాతో ఓటమి పాలయ్యింది. రెండు ఓవర్లలో కేవలం 6 రన్స్ మాత్రమే ఇచ్చి కట్టుదిట్టమైన బౌలింగ్ చేసి జట్టు విజయానికి కారణమైన శ్రీ పెంటమాంబ టీం ఆటగాడు నవీన్ కుమార్ కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించిదంది. అనంతరం క్వార్టర్ ఫైనల్ లో చివరి మ్యాచ్ 64 వారియర్స్ మరియు జుబేర్ న్యూకాలని జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి 64 వారియర్స్ టీమ్ బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి

88 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జుబేర్ న్యూకాలని జట్టు 7.3 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. జుబేర్ న్యూకాలని ఆటగాడు సునీల్ 15 బంతుల్లో 5 సిక్స్ సహాయంతో 36 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు. సునీల్ వరుసగా ప్రీ క్వార్టర్ ఫైనల్, క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకోవడం విశేషం.

క్వార్టర్ ఫైనల్ పోటీలలో విజయం సాధించిన అశోక్ వారియర్స్, ఎస్ వి ఎల్ ఎన్, శ్రీ పెంటమాంబ మరియు జుబేర్ న్యూకాలనీ టీంలు సెమీఫైనల్ కు చేరుకున్నాయి. అనకాపల్లి ఎంపి సత్యవతి, అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్ నాధ్, జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ విఎంఆర్డిఓ చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఉత్తర నియోజక వర్గ సమన్వయ కర్త, నెడ్ క్యాప్ చైర్మెన్ కేకే రాజు, మాజీ ఎమ్మోల్యేలు తైనాల వియన్ కుమార్, రెహమాన్, జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, గాజువాక నియోజక వర్గ ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్లు పివి సురేష్, బిపిన్ కుమార్ జైన్, ఆళ్ళ లీలావతి, వైకాపా నాయకులు దొడ్డి కిరణ్, పేడాడ రమణకుమారి, నిర్వాహక బృందం సభ్యులు విజయ్ మోహన్, పల్లవి, జేమ్స్ స్టీఫెన్, లక్ష్మణ్ తదితరలు పాల్గొన్నారు.

### నేడు (శనివారం) సెమీఫైనల్

శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీలలో గెలుపొందిమ నాలుగు టీమ్ లు శనివారం నాడు జరుగనున్న సెమీఫైనల్ పోటీలలో తలపడనున్నాయి. అశోక్ వారియర్స్ మరియు ఎస్ వి ఎల్ ఎన్ టీమ్స్ మధ్య ఉదయం 9 గంటలకు మొదటి మ్యాచ్ జరగనుంది. అనంతరం మధ్యాహ్నం 1గంటకు శ్రీ పెంటమాంబ మరియు జుబేర్ న్యూకాలని జట్లు తలపడనున్నాయి. సెమీఫైనల్ లో గెలుపొందిన రెండు జట్లు ఆదివారం జరుగనున్న టైటిల్ పోరులో తలపడనున్నాయి. సెమీఫైనల్లో ఓటమి చెందిన రెండు జట్లు కూడా మూడవ స్థానం కోసం ఆదివారం తలపడనున్నాయి.

# గ్రామానికి సాగునీరు, రోడ్డు రెండేళ్లలో పూర్తి

## ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్



శ్రీకాకుళం/పోలాకి, 7 : గ్రామానికి సాగునీరు, రోడ్డు రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ వెల్లడించారు. శుక్రవారం నరసన్నపేట నియోజకవర్గంలోని పోలాకి మండలం సంత లక్ష్మీపురం సన్యాసి రాజు పేట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి ప్రధానంగా రహదారి, సాగునీరు సమస్య ఉందని, ఈ సమస్యలను రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. గ్రామంలో తాగునీటి కి కష్టంగా ఉండేదని, ప్రస్తుతం ఆ సమస్య తీరిందన్నారు. గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు సమస్య తీరిందని వివరించారు. జల జీవన్ మిషన్ పేరిట గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ లను, సిసి రోడ్లును, పాఠశాల విద్య శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలను ఆయన ప్రారంభించారు. నరసన్నపేట బిసి బాలికల వసతి గృహంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయన పాల్గొన్నారు. నరసన్నపేట మండలంలో దేశవానిపేటలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాటశాలను ఆయన పునఃప్రారంభించారు. విద్యార్థులకు పోలాకి జడ్పిటిసి సభ్యులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, తదితరులు విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేసి, వారితో కలిసి ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి ఎంపీపీ ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, తదితరులు పాల్గొన్నారు

# జివిఎంసి విశ్రాంతం ఉద్యోగుల ఆత్మీయ కలయిక



విశాఖపట్నం :- మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆద్వర్యంలో వారి సభ్యులందరూ కలసి శుక్రవారం శివాజీ పార్కులో నూతన సంవత్సరం సందర్భంగా ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అనిల్ కుమార్ మాట్లాడుతూ జివిఎంసిలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన తర్వాత జివిఎంసి నుండి పొందాల్సిన బకాయిలను పొందేందుకు కృషి చేయడం జరుగుతుందని, వారి సంక్షేమానికి, ప్రభుత్వపరంగా వారికి చెందాల్సిన అన్ని బకాయిలను అధికారులతో మాట్లాడి ఇప్పించేందుకు కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఆత్మీయ కలయికలో విశ్రాంత ఉద్యోగులందరూ ఉత్సాహంగా పాల్గొని వారి వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఉత్సాహంగా గడిపి ఒకరి నొకరు అభినందించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ జోగ ప్రసాద్, ట్రెజరర్ ఎం.అప్పారావు, కె.రాధాకృష్ణ రెడ్డి, కె.సత్య రావు, ఆర్.నాగేశ్వర రావు, కె .వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# నూకాలమ్మ దేవస్థానం కమిటీని ఆరోగ్య కేంద్రం కమిటీని ప్రకటించిన మంత్రి అవంతి

భీమునిపట్నం : భీమిలి ఎంతో చరిత్ర గలిగిన చారిత్రాతికమైన ప్రాంతం అందులో ఒకటైన శ్రీ నూకాలమ్మ దేవస్థానం ఒకటి అంతటి మహోన్నతమైన చరిత్ర కలిగిన ఈ భీమిలి లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం భీమిలి పార్టీ కార్యాలయంలో శ్రీ నూకాలమ్మ దేవస్థానం కమిటి చైర్మన్ వాసుపల్లి కొండబాబు ని నియమించగా కమిటీ సభ్యులు గా పిన్నింటి ఎర్రయ్య రెడ్డి , ముక్కి కృష్ణ , కె.నూకరత్నం,జి శారద, కే స్నేహలత,డి.అరుణ, నియమించారు అలాగే ఆరోగ్య కేంద్రం కమిటి చైర్మన్ గా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నియమింపగా మెడికల్ అధికారి అండ్ కన్వినర్ గా డా. సిద్దార్థ ని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా భీమిలి జోనల్ కమిషనర్ యస్. వెంకటరమణ ,మండల పరిషత్ అధికారి పి. వెంకటరమణ డా. కోటికొప్పల మంగతాయారు, ఎర్నింటి అచ్చి బాబు , దుంపల నాగమణి ని నియమించారు.నియామకం అనంతరం మంత్రి అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 136 కార్పోరేషన్ చైర్మన్ డైరెక్టర్ లను , 56 బి సి కార్పోరేషన్ చైర్మన్ డైరెక్టర్ లను నియమించారని. దీనిలో ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని అన్ని వర్గాలను కలుపుకుంటూ ఎస్ .సి ,ఎస్. టి, బి .సి మైనారిటీ మత్స్యకారులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని.గతంలో చాలా వర్గాలు గాని కులాలు గాని నిర్లక్ష్యం చేయబడిన వారిని నేడు రాజకీయం ఆర్థికంగా సామాజికంగా గౌరవం తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి. జగన్మోహన్ రెడ్డి అని నామినేటెడ్ పదవులు కావచ్చు స్థానిక పదవులు కావచ్చు ఎంత మందికి అవకాశం కల్పించవచ్చో అంతకంటే ఎక్కువ మంది కి అవకాశం కల్పించారని. జగన్మోహన్ రెడ్డి సారథ్యం లో భీమిలి నియోజకవర్గం ని మంచి అభివృద్ధి పథంలో నడిపించి వైసిపి కి కంచుకోటగా చేస్తానని చెప్పారు. భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో 3 కోట్ల నిధులతో కొత్తగా గదులు ను నిర్మించడం జరిగిందనీ దీనిని త్వరలో ప్రారంభించడం జరిగుతుందని. నూతనంగా నియమింపబడిన హాస్పిటల్ కమిటీ వచ్చే రోగులకు మంచి ట్రీట్మెంట్ అందించడంలో హాస్పటల్ చూట్టురు శుభ్రత మీద దృష్టి పెట్టాలని నూతన కమిటీకి సూచించారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన గంకల

## - అంగన్వాడీ లో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తా
## - చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన గంకల





### గిరిజన పాస్టర్స్ కు సైకిల్ పంపిణీ

దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : మారుమూల గిరిజన గ్రామాలను సైతం కాలినడకన వెళ్ళిన పాస్టర్స్ కు డాక్టర్ టైటస్ గొర్లే శుక్రవారం కాశీపురం సీయోను ప్రార్థన మందిరం వద్ద వారికి సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టైటస్ మాట్లా డుతూ, ప్రతి ఒక్కరు ప్రేమ సమాజాన్ని నెలకొల్పేందుకు దేవుని వాక్యము ప్రచారం చేసిన వారిని గుర్తించి విశాఖపట్నానికి చెందిన స్టీఫెన్ ప్రసాద్ వారి ప్రోత్సాహంతో పాస్టర్ డేవిడ్ పాస్టర్ యెహెజ్కేలకు సైకిళ్ళు పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు.

# ఉత్సాహంగా సాగిన ఎగ్జిబిషన్ మ్యాచ్



బ్యాటింగ్ చేస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్

- తలపడ్డ అమర్నాథ్11, కేకే రాజు 11 జట్లు
- ఆఖరి బంతికి విజయం సాధించిన కేకే రాజు జట్టు
- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న ఎమ్మెల్యే అమర్నాథ్
- విజేతలకు ట్రోఫీలు అందించిన అనకాపల్లి ఎంపీ సత్యవతి

విశాఖపట్నం ( విజయభాను స్పోర్ట్స్ న్యూస్): వైఎస్ ఆర్ కప్ టోర్నీలో బాగంగా శుక్రవారం ఉత్కంఠంగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లు తిలకించిన ప్రేక్షకులు, నిర్వాహకులు, సహాయకులు అనంతరం జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్ తిలకించి ఆహ్లాదం పొందారు. ఎగ్జిబిషన్ మ్యాచ్ లో అమర్నాథ్11 మరియు కేకే రాజు11 జట్లు తలపడ్డాయి. అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్ నాథ్, ఉత్తర నియోజక వర్గ ఇన్చార్జ్, నెడ్ క్యాప్ చైర్మెన్ కేకే రాజు చెరో జట్టుకు కెప్టెన్లుగా వ్యవహరించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అమర్నాథ్11 జట్లు నిర్ణీయ 6 ఓవర్లలో 2 వికెట్లు నష్టానికి 66 పరుగులు చేసింది. టీం కెప్టెన్ గుడివాడ అమర్నాథ్ 37 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచారు. అనంతరం 67 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేరాజు11 జట్టు 6 వ ఓవర్ చివరి బంతివరకూ ఆడి 67 పరుగులు సాదించి విజేతగా నిలిచింది. టీం కెప్టెన్ కేకే రాజు 12 పరుగులు సాధించారు. 37 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్ వేసి ఒక వికెట్ పడగొట్టినందుకు అమర్నాథ్11 టీం కెప్టెన్ గుడివాడ అమర్నాథ్ కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఎగ్జిబిషన్ మ్యాచ్ అద్యంతం తిలకించిన అనకాపల్లి ఎంపి సత్యవతి విన్నర్ మరియు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీలను విజేతలకు అందజేసారు. ఆంధ్ర యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ మోహన్, వైఎస్ ఆర్ కప్ సాంకేతిక సలహాదారు డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ లు అంపైర్లుగా వ్యవహరించారు. ఏయు ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓడి పల్లవి టాస్ వేసారు. మ్యాచ్ లో జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, గాజువాక నియోజక వర్గం ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్లు బిపిన్ కుమార్ జైన్, మహమ్మద్ ఇమ్రాన్, పివి సురేష్, ఆళ్ళ లీలావతి,కంటిపాము కామేశ్వరి, 89వ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్, వైకాపా మహిళా నేత పేడాడ రమణి కుమారి, వైఎస్ ఆర్ కప్ నిర్వాహక బృందం సభ్యుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



బౌలింగ్ చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు



విజేతలకు ట్రోఫీలు అందించిన అనకాపల్లి ఎంపీ సత్యవతి

## జివిఎంసి దుకాణాల పై ప్రత్యేక కమిటీ సమావేశం



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) :- మహా విశాఖపట్నం నగర పాలక సంస్థకు చెందిన గుత్తకు ఇచ్చే దుకాణాలపై శుక్రవారం జివిఎంసి పాత సమావేశ మందిరంలో గుత్తకు ఇచ్చే దుకాణాల పై ఏర్పడిన ప్రత్యేక కమిటీ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో అన్ని పార్టీల కమిటీ సభ్యులు డిసిఆర్ నల్లనయ్య, జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## ఆన్‌లైన్ వీడియో తరగతుల్లో మహిళా పోలీస్ ల ప్రతిభ



కంచరపాలెం (విజయభాను న్యూస్) :- ఆంధ్ర ప్రదేశ్ వర్చువల్ పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో సచివాలయం మహిళ పోలిసుల 7,8 వ బ్యాచులకు సంబందించి మహిళ పోలీసుల విధుల నిర్వహణ మరియు బాధ్యతల గురించి గతంలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈమేరకు నిర్వించిన ఆన్లైన్ వీడియో తరగతుల్లో సచివాలయం మహిళా పోలీస్ ల ప్రతిభ శిక్షణ లో భాగంగా రాష్ట్ర శిక్షణ తరగతుల రూపకల్పన బృందంలో విశాఖ జిల్లా నుండి ఎయిర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ నుండి 53 వ వార్డు పరిధి మర్రిపాలెం గ్రీన్ గార్డెన్స్ సచివాలయం మహిళా పోలీస్ రాజాన భవాని, పి.ఎం పాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ నుండి 5 వ వార్డు కు 69 వ వార్డు మానాపురం లక్ష్మి రాధిక రాష్ట్ర వ్యాప్తంగా మహిళా పోలీసులకి ఆన్లైన్ వీడియో తరగతులు రూపొందించారు. మొత్తం 16 మంది రాష్ట్ర స్థాయి బృందంలో విశాఖపట్నం జిల్లా నుండి ఇద్దరు ఎంపిక కావడం విశేషం. వీరి ప్రతిభ ను గుర్తించిన రాష్ట్ర డీజీపీ మరియు అడిషనల్ డీజీపీ ప్రశంసా పత్రాలను డి సి పి గౌతమి సాలి ( ఐ .పి.ఎస్ ) ఏ.డి.సి.పి రజిని చేతుల మీదుగా నగర పోలీస్ కమిషనర్ కార్యలయంలో శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా వారిని అభినందించారు.

## నెలవారీ నేర సమీక్ష నిర్వహించిన రూరల్ ఎస్పీ

- దర్యాప్తులు త్వరితగతిన పూర్తి చేయాలి




విశాఖపట్నం రూరల్ (విజయభాను న్యూస్) విశాఖపట్నం జిల్లా పోలీస్ నెలవారీ నేర సమీక్షా సమావేశం శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో వర్చువల్ విధానంలో సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు. జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు మరియు చింతపల్లి నాలుగు సబ్ డివిజన్ పరిధిలో ఏఎస్పీలు, డిఎస్పిలు మినహ, సిఐలు ఎస్సైలు వారి పోలీస్ స్టేషన్ నుండి వర్చువల్ విధానంలో ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లాలో రిపోర్ట్ అయిన గ్రేవ్ కేసుల దర్యాప్తు ఏ స్టేజ్ లో ఉన్నది, దర్యాప్తు వేగవంతం చేయాలని, పెండింగ్ కేసులను త్వరీతగతిన పూర్తి చేసి చార్జిషీటు దాఖలు చెయ్యాలని అన్నారు. ఎన్ఫోర్స్ మెంట్ కేసుల విషయంలో ప్రాధాన్యత చూపాలని అన్నారు. బాడిలీ ఆఫెన్స్ కేసులలో అరెస్టు కావలసిన నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలన్నారు. అలాగే ఎన్.డి.పి.ఎస్., కేసులలో ఎన్ బి డబల్యూ లను త్వరితగతిన అమలు చేసి ముద్దాయిలను కోర్ట్ లో హాజరు పరచాలని అన్నారు.

ఫాటల్ రోడ్ ఏక్సిడెంట్ ల విషయంలో, ఎన్ . హెచ్ 16 లో ముఖ్యంగా, అనకాపల్లి రూరల్ నుంచి పాయకరావుపేట లిమిట్స్ హైవే కి అనుకోని ఉన్న గ్రామాల్లో ప్రజలకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. యాక్సిడెంట్ జోన్లో గుర్తించి, మోటార్ యాక్టు కేసులు ఎక్కువ నమోదు చేసి, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు.

అనుమానాస్పద మృతి మరియి మిస్సింగ్ కేసుల విషయంలో ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి. అలాగే జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ కేసులు (గంజాయి, ఇసుక, నాటు సారా, అక్రమ మద్యం, గుట్కా, కోడిపందాలు, పేకాట మొదలైన ) నమోదు చేయాలని అన్నారు. పోలీస్ బీట్ వ్యవస్థను పటిష్ట పరిచి, నిఘా వ్యవస్థను పెంచి దొంగతనాలను అరికట్టాలని, స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు, అలాగే కేసుల విషయంలో ఎస్.ఐల దర్యాప్తును పర్యవేక్షించి తగిన సూచనలు ఇవ్వాలని అన్నారు. పండగల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తతో మెలగెలా సూచనలు ఇవ్వాలని అన్నారు. జిల్లాలోని ఎస్ హెచ్ వో లు గత సంవత్సరంలో తమ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలు గాని, రోడ్డు ప్రమాదాలు గాని ఎక్కువగా జరిగే వాటి పట్ల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఈ సంవత్సరంలో వాటిని తగ్గించడానికి చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో అధనపు ఎస్పీ క్రైమ్స్ బి.లక్ష్మినారాయణ, ఏఎస్పీ చింతపల్లి తుషార్ డుడి, ఏఎస్పీ పాడేరు పి.జగదీష్, ఏఎస్పీ నర్సీపట్నం మణికంఠ చందొలు, డిఎస్పి అనకాపల్లి బి.సునీల్, డిఎస్పి డి.ఎస్.బి. డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి , అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్ డిఎస్పి మల్ల మహేష్, డిటిసి డిఎస్పి కె.ప్రవీణ్ కుమార్, ఏవో డి పి ఓ బి.శారద - ఎస్బి సిఐ పి.వి.వి.నరసింహరావు, డిసిఆర్బి సీఐ పైడపు నాయుడు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గురువుల కీచకవతారంపై ‘మహిళా కమిషన్’ ఆగ్రహం

- విజయవాడలో ప్రభుత్వ డెంటల్ కాలేజీ ఘటనపై ఆరా - కీచక అసోసియేట్ ప్రొఫెసర్లపై చర్యలకు ఆదేశం



అమరావతి(విజయభాను న్యూస్) : దంత వైద్యవృత్తిలో విద్యార్థినులకు నైపుణ్యాలను నేర్పాల్సిన వైద్యులే కీచకులుగా మారడంపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయవాడలో ప్రభుత్వ దంతవైద్య కళాశాల విద్యార్థినులను ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు లైంగికంగా వేధించడం పై మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ తీవ్రంగా స్పందించారు. శుక్రవారం ఆమె కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యుగంధర్ తో మాట్లాడారు. వైద్య విద్యార్థినుల ఫిర్యాదులు, వాటిపై ఇప్పటివరకు జరిగిన విచారణ నివేదికను పంపాల్సిందిగా ఆదేశించారు. ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఇప్పటి వరకు ‘అంతర్గత ఫిర్యాదుల కమిటీ’ ఏర్పాటు చేయకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) ప్రకారం ప్రతి శాఖలో ఒక అంతర్గత ఫిర్యాదుల కమిటీని నియమించాలని, పనిచేసే చోట మహిళలకు రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని తీసుకు వచ్చారని చెప్పారు.

దంతవైద్య కళాశాలలో సత్వరమే అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని ఏర్పాటు చేసి మహిళా కమిషన్ కు సమాచార మివ్వాలన్నారు. ప్రస్తుతం లైంగిక వేధిం పుల ఆరోపణలు ఎదుర్కొం టున్న ఇద్దరు అసోసి యేట్ ప్రొఫెసర్ల పై గతంలోనూ ఫిర్యాదు లున్నప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని వాసిరెడ్డి పద్మ నిలదీశారు. తక్షణమే అలాంటి కీచక ప్రొఫెసర్లపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ ప్రభుత్వ దంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్, డీఎంఈకు మహిళా కమిషన్ నుంచి అధికారికంగా లేఖను పంపారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com